

డ్రగ్స్ రహిత నగరంగా విశాఖ

- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత
- మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా ఆర్కే బీచ్‌రోడ్డులో ర్యాలీ

విశాఖను డ్రగ్స్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా నగర పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఆర్కే బీచ్ రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్, నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్, తదితరులు పాల్గొన్నారు.

- వివరాలు 8వ పేజీలో

పోర్టు ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారిపై వర్షం





ప్రతిజ్ఞ చేయిస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత

వర్షం... సేదదీరిన నగరం

- ఆరిలోవలో 48.5 మి.మీ.,
- పెందుర్తిలో 37.75 మిల్లీమీటర్లు

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వాతావరణ అనిశ్చితితో బుధవారం సాయంత్రం నగరం, శివారు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘాలు ఆవరించినా ఉక్కపోత కొనసాగింది. అయితే మధ్యాహ్నం తరువాత మేఘాలు ఆవరించి చల్లని గాలులు మొదలయ్యాయి. అనంతరం కొద్దిసేపటికి వర్షం ప్రారంభమైంది. సుమారు గంటపాటు నగరంలో ఒక మోస్తరుగా, శివారు ప్రాంతాల్లో జోరుగా వాన కురిసింది. ఆరిలోవలో 48.5 మి.మీ.లు, పెందుర్తి జోనల్ కార్యాలయం వద్ద 37.75, సింహాచలంలో 35.25, కాపులుప్పాడలో 34.75, గోపాలపట్నంలో 28.75 మి.మీ. వర్షపాతం నమోదైంది. కాగా వాతావరణ అనిశ్చితితో వర్షం కంటే మెరుపులు, పిడుగుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సాయంత్రం 6.33 గంటలకు విశాఖకు 20 కి.మీ. వైశాల్యంలో 2,405 మెరుపులు సంభవించినట్టు కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ రూపొందించిన 'దామిని' యాప్‌లో నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, కోస్తాలో ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు పడతాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఉత్తర కోస్తాలో తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

ఇంటర్ సప్లిమెంటరీలో 43 శాతం ఉత్తీర్ణత

మద్దిలపాలెం, జూన్ 26: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. మే 24 నుంచి జూన్ 1 వరకు నిర్వహించిన ఈ పరీక్షలకు జిల్లా నుంచి జనరల్ విద్యార్థులు 7,984 మంది హాజరయ్యారు. వీరిలో 3,407 మంది (43 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ప్రైవేటు కళాశాలల నుంచి 6,522 మంది హాజరుకాగా 3,047 మంది (46.72 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 895 మంది పరీక్షలు రాయగా 162 మంది (18.1 శాతం) ఉత్తీర్ణులయ్యారు. హైస్కూల్ ప్లస్ విద్యార్థులు 106 మందికి 16 మంది (15.09 శాతం) పాసయ్యారు. ఒకేషనల్ కోర్సుల నుంచి 422 మంది పరీక్షలు రాయగా 197 మంది (47 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలకు చెందిన 321 మందికిగాను 120 మంది (37.38 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు ఒకేషనల్ కళాశాలల నుంచి 95 మంది పరీక్షలు రాయగా 44 మంది ఉత్తీర్ణులయ్యారు.

దూర విద్య డైరెక్టర్ నియామకంపై రగడ

- ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్‌కు బాధ్యతలు
- ఆయన నియామకం పట్ల సర్వత్రా విమర్శలు
- దూర విద్యకు ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధమేమిటంటూ ప్రశ్నలు

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం డైరెక్టర్‌గా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్‌ను పాలకులు నియమించడం చర్చనీయాంశమైంది. పదవీ విరమణ తరువాత డైరెక్టర్‌గా కొనసాగుతున్న ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇటీవల బాధ్యతల నుంచి తప్పుకున్నారు. వర్సిటీ అధికారులు ఆ పోస్టులో ప్రొఫెసర్ ఎన్.విజయ్ మోహన్‌ను నియమించారు. అయితే, ఈ నియామకం పట్ల వర్సిటీలో పెద్ద చర్చ సాగుతోంది. దూర విద్యా కేంద్రానికి డైరెక్టర్‌గా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన వ్యక్తిని ఎలా నియమిస్తారంటూ సీనియర్ ప్రొఫెసర్లు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా దూరవిద్యలో బోధించే సబ్జెక్టులకు సంబంధించి సీనియర్ ప్రొఫెసర్‌కు ఆ బాధ్యతలను అప్పగించాలి. కానీ, అందుకు విరుద్ధంగా విజయమోహన్‌ను నియమించారు. గడిచిన కొన్నాళ్ల నుంచి దూర విద్య కేంద్రం డైరెక్టర్ నియామకం పూర్తిగా గాడి తప్పిందనే విమర్శలు ఉన్నాయి. సాధారణంగా దూరవిద్యా కేంద్రం డైరెక్టర్‌ను నియమించాలంటే ముందుగా నోటిఫికేషన్ విడుదల చేయాలి. ఇంటర్వ్యూలు నిర్వహించి అకడమిక్ మెరిట్ ఉన్న వారికి బాధ్యత అప్పగించాలి. అందుకు విరుద్ధంగా నచ్చిన వాళ్లను నియమించుకునే సంప్రదాయాన్ని వర్సిటీ అధికారులు కొన్నాళ్ల నుంచి కొనసాగిస్తున్నారు. అయితే, ఇప్పటివరకూ దూరవిద్యలో బోధించే సబ్జెక్టుల్లో ఉన్న వారికి మాత్రమే అవకాశం కల్పిస్తుండగా, తాజాగా అందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరించారు. విజయ్‌మోహన్‌ను నియమిస్తూ వర్సిటీ అధికారులు ఈ నెల 24న ఉత్తర్వులు జారీచేశారు.

టోల్‌గేట్‌పై దాగుడుమూతలు

ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఫోన్

- ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారి నిర్మాణం పూర్తయినందున అగనంపూడిలో టోల్‌గేటు ఎత్తివేయాలని విజ్ఞప్తి
- బుధవారం నిలిచిన వసూళ్లు
- కానరాని సిబ్బంది
- ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నామంటున్న ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్



సిబ్బంది లేకపోడంలో ఖాళీగా ఉన్న టోల్‌బూత్



అగనంపూడి వద్ద టోల్‌గేటు

అగనంపూడి, జూన్ 26:

అగనంపూడి టోల్‌గేటు వద్ద బుధవారం వసూలు ఆగాయి. అయితే ఇంకా నిలిపివేసినట్టేనని స్థానికులు భావిస్తుండగా, అలాంటిదేమీ లేదని నేషనల్ హైవే అథారిటీ అధికారులు అంటున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామంటున్నారు.

నగర పాలక సంస్థ పరిధిలో టోల్‌గేటు ఉండరాదన్న నిబంధనను తుంగలో తొక్కి గత కొన్నేళ్లుగా వాహనాల నుంచి ఫీజు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై ఈ ప్రాంతవాసులు చాలాకాలంగా ఆందోళనలు చేస్తున్నారు. 2019లో ఎమ్మెల్యేగా ఉన్న పల్లా శ్రీనివాసరావు... గాజువాక బార్ అసోసియేషన్ సాయంతో హైకోర్టులో న్యాయం పోరాటం చేసి టోల్‌గేటును ఎత్తివేయించారు. ఆ తరువాత మూడు నెలల వ్యవధిలోనే వైసీపీ అధికారంలోకి రావడంతో

... మిగతా 4వ పేజీలో

రాజీనామాకు ససేమిరా?

- నోటి మాటతో చెబితే చేయను, రాతపూర్వకంగా ఇవ్వాల్సిందే
- మొండికేస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి
- ఆ ఉత్తర్వులు తీసుకుని న్యాయ స్థానానికి వెళ్లే యోచన



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి మొండిగా వ్యవహరిస్తున్నారు. రాజీనామా చేయాలని ఉన్నతాధికారులు సూచించినా లెక్క చేయడం లేదు. తనకు నోటి మాటతో చెబితే చాలదని, రాతపూర్వకంగా ఇస్తేనే రాజీనామా చేస్తానని సందేశం పంపారు.

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి గడచిన ఐదేళ్లుగా వైసీపీ కోసం బహిరంగంగానే పనిచేశారు. టీడీపీ నాయకులను విమర్శించారు. ఒక ఉన్నత విద్యా సంస్థకు జవాబుదారీగా ఉంటూ అలా మాట్లాడడం తప్పు అయినప్పటికీ ఆయన వెనకడుగు వేయలేదు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారని, యూనివర్సిటీని

... మిగతా 4వ పేజీలో

ఉల్లంఘనులపై విచారణ

అక్రమ క్వారీయింగ్‌పై ప్రభుత్వం దృష్టి

- ఉమ్మడి జిల్లాలో నాలుగింటిపై విచారణకు ఆదేశం
- నగరంలో సీబీసీఎన్‌సీ భూముల్లో మొదలైన సర్వే
- పరవాడలో మాజీ మంత్రి ముత్యాలనాయుడు క్వారీపై త్వరలో దర్యాప్తు
- గుర్రంపాలెంలో అడ్డగోలుగా తవ్వకాలు



పెందుర్తి మండలం గుర్రంపాలెంలో తవ్వకాలు

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

గత ప్రభుత్వంలో క్వారీల లీజులు, అడ్డగోలుగా చేపట్టిన తవ్వకాలపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టిసారించింది. పర్మిట్లకు మించి తవ్వకాలు చేపట్టిన క్వారీల్లో ఏ మేరకు అక్రమాలు జరిగాయో నిగ్గు తేల్చాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో నాలుగు క్వారీలపై అందిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టాలని ఆదేశించింది.

విశాఖ నగరంలోని సిరిపురం జంక్షన్‌లో సీబీసీఎన్‌సీ భూముల్లో నిర్మాణాల కోసం చేపట్టిన తవ్వకాలు, పరవాడ మండలంలో మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు కుమారుడి పేరిట తీసుకున్న క్వారీ, తాడి గ్రామంలో మరో క్వారీ, పెందుర్తి మండలం గుర్రంపాలెంలో ఏపీఐఐసీ భూముల్లో పారిశ్రామికవేత్తలకు ఇచ్చిన ప్లాట్ల చదును పేరిట సమీపంలో కొండను తవ్వడంపై విచారణ చేయాలని గనుల శాఖకు ప్రభుత్వం సూచించింది. క్వారీయింగ్‌కు ఎంత విస్తీర్ణం మేర లీజుకు తీసుకున్నారు?, తాత్కాలిక పర్మిట్లు ఇచ్చారా?, లేదా?, పర్మిట్‌కు మించి తవ్వకాలు జరిపారా?...తదితర విషయాలపై సమగ్ర సర్వే చేయాలన్న ఆదేశాలు వచ్చాయి.

సిరిపురం జంక్షన్‌లో సీబీసీఎన్‌సీ స్థలంలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాల కోసం లోతుగా పునాదులు తీయాల్సి ఉంది. దీనికోసం రాళ్లను దొలిచి అక్కడ నుంచి బయటకు తరలించాల్సి ఉంటుంది. ఇందుకు మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు సంబంధించిన సంస్థ లక్ష క్యూబిక్ మీటర్ల రాయి, మట్టి తవ్వి తరలించడానికి తాత్కాలిక పర్మిట్‌కు గనుల

... మిగతా 4వ పేజీలో

పింఛన్ పండుగ

ఒకటో తేదీన రూ.4,000 పంపిణీకి ఏర్పాట్లు

- జిల్లాలో 1,64,139 మంది కోసం రూ.112.21 కోట్లు మంజూరు
- ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి 1,000 చొప్పున కలిపి ఒక్కొక్కరికి 7,000 అందజేత
- ఇంటి వద్దే పంపిణీకి ఏర్పాట్లు
- సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగింత



విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వచ్చే నెల ఒకటో తేదీన పెంచిన పింఛన్ మొత్తం పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లు గీత, మత్స్యకార, ఒంటరి మహిళ, ట్రాన్స్‌జెండర్, డప్పు కళాకారులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.మూడు వేల పింఛన్‌ను కూటమి ప్రభుత్వం రూ.నాలుగు వేలకు పెంచింది. అలాగే దివ్యాంగులకు ఇచ్చే పింఛన్‌ను రూ.మూడు వేల నుంచి రూ.ఆరు వేలకు, పూర్తి వైకల్యంతో కదల్లేని స్థితిలో ఉన్నవారికి, కిడ్నీ, లివర్ వ్యాధిగ్రస్తులకు ఇచ్చే పింఛన్‌ను రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెంచింది. ఈ మేరకు జిల్లాలో 1,64,139 మందికి రూ.112.21 కోట్లు మంజూరుచేసింది. సాధారణంగా జిల్లాలో సామాజిక పింఛన్లకు రమారమి రూ.49 కోట్లు అవసరం పడేది. కానీ, ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి వెయ్యి చొప్పున మూడు వేలు కలిపి మొత్తం రూ.7 వేలు జూలై ఒకటో తేదీన పింఛన్‌దారులకు పంపిణీ చేస్తామని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ప్రకటించారు. ఆ మేరకు జిల్లాలకు నిధులు కేటాయించారు. ఆగస్టు నుంచి జిల్లాకు రూ.64 కోట్లు వరకూ అవసరం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేసే బాధ్యతను గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులకు ప్రభుత్వం అప్పగించింది. ఈ నేపథ్యంలో వలంటీర్ల వద్దనున్న బయోమెట్రిక్ డివైజ్‌లు, ఫోన్లను ఇప్పటికే సచివాలయాల సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఆ డివైజ్‌లతో సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ కోసం ఆన్‌లైన్‌లో లాగిన్ కానున్నారు. ఈనెల 30వ తేదీ ఆదివారం కావడంతో 29వ తేదీనే సచివాలయాల సిబ్బందికి పింఛన్ నగదు అందజేస్తారు. జూలై ఒకటో తేదీన పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కూటమి పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొననున్నారు. పింఛన్ల కార్యక్రమం పండుగలా చేపట్టాలని ఇప్పటికే ప్రభుత్వం సూచించింది. దీని ప్రకారం ప్రజా ప్రతినిధులతోపాటు కూటమి పార్టీల నుంచి ఎవరెవరు పాల్గొంటారో జాబితాను అధికారులు తీసుకుంటున్నారు.

కూలిన గ్రీన్‌బెల్ట్ ప్రహరీ గోడ

- కొద్దిరోజుల కిందటే నిర్మించిన జీవీఎంసీ
- నాణ్యతాలోపం వల్లే కూలిపోయిందని విమర్శలు

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిని ఆనుకుని ముస్లిం తాటిచెట్లపాలెం వద్ద గ్రీన్‌బెల్ట్ రక్షణ కోసం నిర్మించిన ప్రహరీ గోడ బుధవారం కూలిపోయింది. ఎనిమిది అడుగులకుపైగా ఎత్తు కలిగిన గోడ హఠాత్తుగా సగానికి విరిగి పక్కనున్న సర్వీస్ రోడ్డుపై పడింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో వాహనాలు, మనుషుల రాకపోకలు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. జాతీయ రహదారి వెంబడి గ్రీన్‌బెల్ట్ పరిరక్షణ కోసం జీవీఎంసీ ఇటీవల చర్యలు చేపట్టింది. అందులో భాగంగా అక్కయ్యపాలెం జంక్షన్ నుంచి ముస్లింతాటిచెట్లపాలెం వరకూ సర్వీసురోడ్డును ఆనుకుని కొన్నిచోట్ల కొత్తగా రక్షణ గోడ నిర్మించింది. అలా ముస్లిం తాటిచెట్లపాలెం వద్ద సుమారు రెండు నెలల క్రితం నిర్మించిన ప్రహరీ గోడ బుధవారం కూలిపోయింది.గోడ నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడం ఇందుకు కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు గోడ నిర్మాణంపై దృష్టిసారించి, అవసరమైతే మొత్తం తొలగించి పునర్నిర్మించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ముస్లింతాటిచెట్లపాలెం వద్ద కూలిన ప్రహరీగోడ

టెన్త్ సప్లిమెంటరీలో 51.7% ఉత్తీర్ణత

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు విశాఖ జిల్లా నుంచి 3,671 మంది హాజరుకాగా 1,895 మంది (51.7 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలురు 2,230 మందికి 1,134 మంది (50.85 శాతం), బాలికలు 1,441 మందికి 764 మంది (53.02 శాతం) ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో విశాఖ జిల్లా 22వ స్థానంలో నిలిచింది.

1011 మందికి ఐటీఐల్లో సీట్లు కేటాయింపు

ముగిసిన మొదటి విడత కౌన్సెలింగ్

కంచరపాలెం, జూన్ 26 : కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభమైన మొదటి విడత ఐటీఐ కౌన్సెలింగ్ బుధవారంతో ముగిసింది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాల కోసం 3398 మంది అభ్యర్థులు ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకున్నారు. వీరిలో వారం రోజుల నుంచి జరిగిన కౌన్సెలింగ్‌నకు 1764 మంది హాజరయ్యారు. మెరిట్, రోస్టర్ ఆధారంగా ఎలక్ట్రికల్, ఫిట్టర్ డీజిల్ మెకానిక్, వెల్డర్, కార్పెంటర్, ఫంబర్ తదితర ట్రేడుల్లో 1011మందికి సీట్లను కేటాయించినట్టు ఐటీఐ ప్రవేశాల జిల్లా కన్వీనర్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా ఐటీఐల్లో తక్షణమే రిపోర్టు చేయాలని ఆయన సూచించారు. నూతన విద్యాసంవత్సరం తరగతులు రెండు రోజుల్లో ప్రారంభం కానున్నాయన్నారు.

అలరించిన పౌరాణిక నాటకం



నాటకంలో ఓ సన్నివేశం

అక్కయ్యపాలెం, జూన్ 26: గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి లలితాపీఠంలో డాక్టర్ మీగడ రామలింగస్వామి బృందంతో భక్తనత్కీర నాటక ప్రదర్శన జరిగింది. ధూర్జటి శ్రీకాళహస్తి మహత్యం కావ్యం ఆధారంగా రామలింగస్వామి రచించిన ఈ నాటకం ప్రేక్షకులను రంజింప చేసింది. పలు నంది పురస్కారాలు స్వీకరించిన రామలింగస్వామి నత్కీరుడి పాత్ర పోషించారు. పాండ్య రాజుగా వి.సత్యం, నారదునిగా డాక్టర్ అత్తిలి శంకర్ తదితర నటులు చక్కని నటనతో రసోచితమైన పద్యపఠనంతో ఆద్యంతం ప్రేక్షకులను అలరించారు. మీగడ మల్లికార్జున స్వామి తదితరులు వాద్య సహకారం అందించారు. ప్రదర్శన అనంతరం కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ స్వామి నాటక బృందాన్ని సత్కరించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

అక్కయ్యపాలెం, జూన్ 26 : టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ వారు నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశం కల్పించనున్నట్టు సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాయక్ తెలిపారు. ఇంటర్ పాస్, డిగ్రీ అయిన 18 నుంచి 28 ఏళ్ల వయస్సు లోపు యువతీ, యువకులకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి, ఉపాధి కల్పించనున్నట్టు చెప్పారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్‌నెట్ కాన్సెప్ట్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ అందించి అనంతరం ఉపాధి అవకాశాలు చూపుతామన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఎన్ఏడీ బాజీ జంక్షన్‌లోని నిర్మాణ ఆర్గనైజేషన్ కేంద్రంలో కానీ, లేదా ఫోన్: 95028 74304, 99081 04113లలో 30వ తేదీ లోగా సంప్రదించాలని కోరారు.

రచయితలకు సామాజిక బాధ్యత అవసరం



మాట్లాడుతున్న రచయిత డాక్టర్ సుగుణరావు

సీతంపేట, జూన్ 26: రచయితలకు సామాజిక బాధ్యత ఉండాలని రచయిత ఎం.సుగుణరావు తెలిపారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ డిగ్రీ కళాశాలలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో కథా కచేరీ నిర్వహించారు. పలు కథలను రచయితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా సుగుణరావు మాట్లాడుతూ, కథలు ఎక్కడినుంచో రావని, జీవిత అనుభావాల్లోని అంశాలే ముడిసరకు అని అన్నారు. దళిత, మహిళల సమస్యలను తెలుసుకోవాలని కోరారు.రాజకీయ, సామాజిక అంశాలను, సమస్యలను ఆకళింపు చేసుకుంటే చక్కటి సృజన కారుడు అవు తాడన్నారు.సభకు అధ్యక్షత వహించిన సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథల్లో శిల్పం సరిగా లేకపోతే కథనం దెబ్బతింటుందన్నారు. యువ రచయితలకు సాధన ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా డాక్టర్ సూరపనేని విజయకుమార్, సంస్థ కార్యదర్శి సీహెచ్ చిన సూర్యానారయణ, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత, డాక్టర్ కె.వి.ఎస్. మూర్తి, పి.పి. ఆర్. కుమార రావు, పరమేశ్వరరావు, బి.రాధామణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలాస, గుణుపూర్, కోరాపుట్ పాసింజర్ రైళ్లు రద్దు

విశాఖపట్నం, జూన్ 26: పూండి, నౌపద మెయిన్ లైనులో భద్రతా ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 27న (గురువారం) పలాస-విశాఖ (07471), విశాఖ-పలాస (07470), విశాఖ - గుణుపూర్ (08522), గుణుపూర్- విశాఖ (08521), కోరాపుట్- విశాఖ (08545) పాసింజర్ రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. అలాగే, గురువారం పలు ఒరిజినేటింగ్ రైళ్లను రీ షెడ్యూల్ చేయడంతో భువనేశ్వర్ - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (12830) మూడు గంటలు ఆలస్యంగా, రాయపూర్-విశాఖ పాసింజర్ (08527) రెం డు గంటలు, టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) రెండు గంటలు ఆలస్యంగా బయలు దేరుతాయని పేర్కొన్నారు.

ఇకపై వివేక్ ఎక్స్‌ప్రెస్ డైలీ

డిబ్రుగర్, కన్యాకుమారి మధ్య వారానికి ఐదు రోజులు నడుస్తున్న వివేక్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను (22504/ 22503) ప్రయాణికుల డిమాండ్ మేరకు డైలీ (ప్రతిరోజు) ఎక్స్‌ప్రెస్‌గా ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. డిబ్రుగర్ - కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504) రైలు జూలై ఎనిమిది నుంచి, తిరుగు ప్రయాణంలోని కన్యాకుమారి- డిబ్రుగర్ వివేక్ ఎక్స్‌ప్రెస్ (22503) రైలు జూలై 12వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

అనుమతుల్లేని వైసీపీ కార్యాలయాలు కూల్చివేయాలి

- దసపల్లా భూముల డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ రద్దు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనుమతులు లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయాలను తక్షణమే కూల్చివేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి జిల్లాల్లో ప్రభుత్వ సొమ్ముతో రుషికొండ ప్యాలెస్‌ను మించి వైసీపీ కార్యాలయాలు నిర్మించారన్నారు. కొన్నిచోట్ల ప్రైవేటు స్థలాలు కబ్జాచేశారన్నారు. అనకాపల్లిలో కాపు భవన్‌కు కేటాయించిన స్థలంలో వైసీపీ కార్యాలయం నిర్మించారని రాష్ట్ర వ్యాప్తంగా 42.44 ఎకరాల ప్రభుత్వ భూములు తీసుకున్నారన్నారు. వైసీపీ పాలనలో అన్ని అనుమతులు ఉన్న టీడీపీ నాయకుల భవనాలు కూల్చివేసి ఇష్టానుసారంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. అనుమతుల్లేని వైసీపీ భవనాలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఐదేళ్లలో రాక్షస ముఖ్యమంత్రి పాలించారని, ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పుతో జగన్‌ను ఇంటికి పంపినా అతనిలో తలపొగరు తగ్గలేదన్నారు. విశాఖలో హయగ్రీవ, సీబీఎన్‌సీ భూముల్లో చేపడుతున్న నిర్మాణాలపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించిందన్నారు. దసపల్లా భూములపైనా చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో దక్షిణ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్‌లీడరు పీలా శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గండి బాబ్జీ

కనకమహాలక్ష్మి ఆలయానికి విరాళంగా భవనం



ఇంటిని రాసిచ్చిన గంటి కుటుంబీకులతో ఈవో శ్రీనివాసులురెడ్డి, అధికారులు

జగదాంబ కూడలి, జూన్ 26: వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం విస్తరణకు గంటి కామేశ్వరరావు, ప్రభాకర్, అరుణ్‌కుమార్, శ్యామలాదేవి కుటుంబ సభ్యులు రూ. 40 లక్షల విలువ చేసే గృహాన్ని దేవదాయ శాఖ సహాయక మిషనర్, ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డికి, సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరావుకు అందజేశారు. గురువారం ఈవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గంటి కుటుంబీకులు ఇంటికి సంబంధించి ఆస్తి పత్రాలిచ్చి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయానికి సమీపాన ఉన్న పల్లవారివీధి, డోర్ నెంబరు 25-5-1లో 83.33 చ.గ విస్తీర్ణంలో ఉన్న గ్రౌండ్, మొదటి అంతస్తు కలిగిన గృహాన్ని అమ్మవారి పేరు మీద సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో గురువారం రిజిస్ట్రేషన్ చేయించి వాటికి సంబంధించిన పత్రాలు, ఇంటి తాళాలను ఆలయ ఈవోకు అందజేశారు. ఈనేపథ్యంలో ఈవో శ్రీనివాసుల రెడ్డి వారిని అభినందించారు. ఈ ఇంటిని అమ్మవారి ఆలయ విస్తరణ కోసం వినియోగిస్తామన్నారు.

కూరగాయల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి

సీత మ్మధార, జూన్ 26: సీతమ్మధార రైతుబజార్‌లో ఉద్యానవన శాఖ కూరగాయల సాగుపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి ఎస్‌కే యాసిన్, జిల్లా ఉద్యానవన అధికారి కె. సత్యనారాయణ రెడ్డి రైతులకు పలు అంశాలను వివరించారు. పందిరి కూరగాయల సాగు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కూరగాయలు, మల్బరీ సాగు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న పంట రాయితీలను వివరించారు.రైతుబజార్ ఎస్టేట్ అధికారి పి.కొండబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఉద్యాన అధికారి జి.సోని,సహాయకుడు కె.సతీష్ పాల్గొన్నారు.

ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా రేపు

కంచరపాలెం, జూన్ 26 : కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 28వ తేదీన జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధికల్పనాధికారి సీహెచ్.సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జాబ్‌డీలర్స్, జయభేరి, క్రెడిట్ యాక్సస్ గ్రామీణ్ లిమిటెడ్, మెడ్ ప్లస్ తదితర కంపెనీలు పాల్గొననున్నాయి. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఫార్మసీ కోర్సులు పూర్తిచేసిన యువత హాజరుకావచ్చు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ముందుగా నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో తమ వివరాలను అప్‌లోడ్ చేయాలని సుబ్బిరెడ్డి సూచించారు.అన్నీ ధ్రువపత్రాలతో శుక్రవారం ఉదయం 9గంటలకు ఉపాధి కార్యాలయం వద్దకు హాజరుకావాలని కోరారు.

ఆర్‌బీఎంయూపీ పాఠశాలలో ప్రవేశాలు

డాబాగార్డెన్స్, జూన్ 26: గ్రేటర్ 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని రమాదేవి బానోజీ ప్రాథమికోన్నత పాఠశాల (ఆర్‌బీఎంయుపీ)లో అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రధానోపాధ్యాయులు హనుమంతు ప్రభాకర్ తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఎనిమిది తరగతి వరకు విద్యార్థులు ప్రవేశం పొందాలని కోరారు. అడ్మిషన్లు కోరే వారు విద్యార్థి ఆధార్‌కార్డు, తల్లి, తండ్రి ఆధార్‌కార్డులు, తెలుపు రేషన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ ద్వారా అందించాలని సూచించారు.

మీ సేవ నిర్వాహకులకు న్యాయం చేస్తాం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న మీసేవ నిర్వాహకులు

జ్ఞానాపురం, జూన్ 26: ఎన్నికలకు ముందు యువగళంలో టీడీపీ యువ నాయకుడు లోకేశ్ మీసేవ నిర్వాహకులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తప్పక నెరవేర్చనుందని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆయన రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడిగా గురువారం ప్రమాణస్వీకారం చేయనున్న సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా మీసేవ నిర్వాహకులు బుధవారం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. అలాగే, మీ సేవ కేంద్రాలకు పూర్వ వైభవం తెచ్చే విధంగా కృషి చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో రాష్ట్ర వ్యాప్తంగా 11 వేల మీసేవ కేంద్రాల నిర్వాహకులు వీధిన పడ్డారన్నారు. వీరికి సరైన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి వందలాది రూ. కోట్లు ఆదాయాన్ని అందించే మీసేవ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవ సరం ఉందని, అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారన్నారు. ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మీసేవ ప్రతినిధులు రొంగళి గంగా భవాని, మళ్ల మోహన్, చదరం తులసీరాం, చందు, విజయలత, రూప, గణేష్ పాల్గొన్నారు.

పోర్టులో నూతన అగ్నిమాపక వాహనాలు ప్రారంభం



అగ్నిమాపక వాహనాలు ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం అంగముత్తు

విశాఖపట్నం, జూన్ 26: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆటోమోటివ్ విభాగంలో రెండు అధునాతన అగ్నిమాపక వాహనాలు చేరాయి. వీటిని పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు బుధవారం ప్రారంభించారు. చెన్నైకు చెందిన ఏబీ ఎస్ మెరైన్ సర్వీసెస్ లిమిటెడ్ నుంచి వీటిని ఐదేళ్ల కాలానికి పోర్టు అద్దెకు తీసుకుంది. ఒక్కో వాహనం నెలవారీ అద్దె రూ.5,84,100. వివిధ రకాల అగ్నిప్రమాదాలను నివారించేందుకు ఇవి పనిచేస్తాయి. పోర్టు అగ్నిమాపక సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగు పరిచేందుకు దోహదపడతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. పోర్టు అవసరాలతో పాటు ప్రభుత్వరంగ సంస్థలకు అత్యవసర సమయాల్లో సేవలందిస్తాయని చైర్మన్ వెల్లడించారు. కార్యక్రమంలో పలు విభాగాల అధిపతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్‌తో ముచ్చటగా మూడో చిత్రం

- 'సంక్రాంతికి వస్తున్నాం' వర్కింగ్ టైటిల్
- సినీ దర్శకుడు అనిల్ రావిపూడి
- సినిమా స్క్రిప్ట్‌కు సింహాచలం అప్పన్న సన్నిధిలో పూజలు

సింహాచలం, జూన్ 26: విక్టరీ వెంకటేష్‌తో తీస్తున్న మూడో సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. ఆ సినిమా స్క్రిప్ట్‌నకు సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో పూజలు చేయించేందుకు బుధవారం ఇక్కడకు చేరుకున్న ఆయనకు ఆలయ పర్యవేక్షణాధికారి పిళ్లా శ్రీనివాస్ స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలో పూజలు చేయించారు. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ ఇప్పటివరకు తన దర్శకత్వంలో తెరకెక్కిన ఏడు సినిమాల్లో వెంకటేష్‌తో చేసిన ఎఫ్-2, మహేష్‌బాబుతో తీసిన 'సరిలేరు నీకెవ్వరు' సినిమాలు సంక్రాంతి పండుగకే రిలీజై విజయవంతం అయ్యాయన్నారు. తాజాగా వెంకటేష్‌తో తీయనున్న చిత్రాన్ని కూడా 2025 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామన్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' అనే వర్కింగ్ టైటిల్‌తో జూలై, ఆగస్టు నెలల్లో సెట్స్ పైకి వెళ్లనున్న ఈ సినిమాలో వెంకటేశ్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ నటిస్తున్నారన్నారు. ధమాకా వంటి హిట్ సినిమాలకు బాణీలు సమకూర్చిన భీమ్స్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తారన్నారు. తొలిసినిమా పటాస్‌తో పాటు ఇప్పటివరకు తీసిన ఏడు సినిమాలకు వైజాగ్‌లోనే స్క్రిప్ట్‌కు తుదిమెరుగులు దిద్దడం, సింహాద్రి అప్పన్న సన్నిధిలో పూజలు చేయించడం ఆనవాయితీగా వస్తోందని, అదే ఒరవడిని కొనసాగించామన్నారు. కేరళ, పొలాచ్చిలోని పలు ప్రాంతాలతో పాటు విశాఖ మన్యంలో షూటింగ్ చేయాలని యోచిస్తున్నామన్నారు. చిత్ర కథా రచనలో సహకరిస్తున్న సాయికృష్ణ, నారాయణ, అంజు మహంకాళి, నాగ, కో-డైరెక్టర్ సూర్యతో కలిసి స్వామిని దర్శించుకున్న అనంతరం అనిల్ రావిపూడికి పండితులు వేదాశీర్వచనాలను, ప్రసాదాలను అందజేశారు.



సింహాద్రి అప్పన ఆలయ ఆవరణలో స్క్రిప్ట్‌తో అనిల్ రావిపూడి, సహచరులు

మాదక ద్రవ్య రహిత జిల్లాగా రూపొందిస్తాం



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టరేట్ ఉద్యోగులు

మహారాణిపేట, జూన్ 26: మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేస్తామని కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి కే మోహన్ కుమార్ అధికారులు, సిబ్బందితో కలసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ దేవ్‌ప్రసాద్, వివిధ విభాగాల పర్యవేక్షకులు సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

అక్కయ్యపాలెం: మాదక ద్రవాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది చిన్నారులుమాదక ద్రవ్యాలకు అలవాటుపడుతున్న సంఘటనలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో అన్ని జిల్లాల పోలీసు, ఎస్ఈబీ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులను ఎప్పటికప్పుడు బాలల కమిషన్ అప్రమత్తం చేస్తుందని తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల కృషి చేయాలని కోరారు.

వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి మాజీ కమిషనర్‌కు వీడ్కోలు



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ అధికారులు

సిరిపురం, జూన్ 26: రెండేళ్లు వీఎంఆర్డీఏ ఇన్‌చార్జి కమిషనర్‌గా డా.ఎ.మల్లికార్జున అందించిన సేవలు ప్రశంసనీయమని అధికారులు కొనియాడారు. సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో బుధవారం సాయంత్రం మల్లికార్జున ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఆయన భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కీర్తి, సంయుక్త కమిషనర్ రవీంద్ర, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, చీఫ్ అకౌంటెంట్ హరిప్రసాద్, చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, కార్యనిర్వాహక ఇంజనీర్ బలరామరాజు, చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, డీఎఫ్ఓ శ్యామల, సిబ్బంది పాల్గొన్నారు.

పూడికల తొలగింపు



పూడిక తొలగిస్తున్న కార్మికుడు

జగదాంబ కూడలి, జూన్ 25: ఫెర్రీ రోడ్డు, కోటవీధి ఏరియాల్లో అండర్ డ్రైన్లు, కాలువలు పూడికలను తొలగిస్తున్నారు. కొద్ది రోజుల కిందట ఈ ప్రాంతంలో పారిశుధ్య సమస్యను టీడీపీ స్థానిక ముస్లిం నాయకుడు లడ్డూ జీ వీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పలుచోట్ల పూడికలను యూసీడీ సిబ్బంది తొలగించే పనులు చేపడుతున్నారు.

హోం మంత్రికి విద్యాశాఖాధికారుల అభినందన



హోంమంత్రి అనితతో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను పాఠశాల విద్యాశాఖ అధికారులు బుధవారం ఆమె ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి వచ్చిన అనితి హోంమంత్రిగా బాధ్యతలు అధిరోహించడంపై వారంతా శుభాభినందనలు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో విశాఖ ఆర్జేడీ జ్యోతికుమారి, డీఈవో చంద్రకళ, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీ శ్రీనివాసరావు ,ఉపాధ్యాయ సంఘనేతలు పైడిరాజు, రవి తదితరులున్నారు.

చట్ట సభల్లో అవకాశం కల్పించండి

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు మహ్మద్ నజీర్ వినతి

మహారాణిపేట, జూన్ 26: తనకు చట్ట సభల్లో అవకాశం కల్పించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. బుధవారం కుప్పంలో ముఖ్య మంత్రిని ఆయన మర్యాద పూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనేక సంవత్సరాలుగా పార్టీకి సేవలందించానని, ఈస్థితిలో తనకు చట్టసభలలో అవకాశం కల్పించాలని ఆయన అభ్యర్థించారు. ఈ సందర్భంగా చంద్రబాబు పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్టు నజీర్ తెలిపారు.



ముఖ్యమంత్రితో నజీర్

డివైడర్ తొలగింపుతో ఊరట



జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్తున్న వాహనదారులు

డాబాగార్డెన్స్, జూన్ 22: జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గమధ్యలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ డివైడర్‌ను ఎట్టకేలకు సంబంధిత అధికారులు తొలగించారు. ఇక్కడ డివైడర్ ఏర్పాటుతో వాహనదారులు చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొందరు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లాలంటే తమతో తెచ్చుకున్న లాగేజీని నెత్తిన పెట్టుకుని ఊసురుమంటూ వెళ్లిన సంఘటనలు కోకొల్లాలున్నాయి. ఈ నేపథ్యంలో డివైడర్‌ను తొలగించడంతో రాకపోకలు సులభతరం కావడంతో పలువురు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఏబీవీపీ విభాగ్ సంఘటన కార్యదర్శిగా సాయికుమార్

డాబాగార్డెన్స్, జూన్ 26: తిరుపతిలో ఈ నెల 23 నుంచి 26 వరకు జరుగుతున్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత అభ్యాసవర్గం సాయికుమార్‌ను విశాఖ విభాగ్ కార్యదర్శిగా ఎంపిక చేసింది. 2019 నుంచి రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ ఏబీవీపీలో సాయికుమార్ అనేక బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తానని తెలిపారు.

టోల్‌గేటుపై దాగుడుమూతలు

... 3వ పేజీ తరువాయి

ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు మళ్లీ టోల్‌గేటును ఏర్పాటుచేశారు. గత ఐదేళ్లగా వాహనాల నుంచి ఫీజు వసూలు చేస్తున్నారు. దీంతో తాము అధికారంలోకి వస్తే టోల్‌గేటు తొలగిస్తామని ఇటీవల ఎన్నికల ముందు పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కూటమి కార్యకర్తలు కొందరు మంగళవారం రాత్రి టోల్‌గేటు వద్ద ఆందోళన చేపట్టారు. స్టాపర్లు తొలగించి వాహనాల నుంచి ఫీజులు వసూలు చేయకుండా అడ్డుకున్నారు. అనంతరం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఫోన్‌లో మాట్లాడారు. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి నిర్మాణం పూర్తయ్యాక ఇక్కడ టోల్‌గేటును తొలగిస్తామని చెప్పారని, అయినా ఇంకా వసూళ్లు కొనసాగించడ మేమిటని ప్రశ్నించారు. టోల్‌గేటు వద్ద వసూళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమన్నారు. ఈ విషయంలో శాంతిభద్రతల సమస్య తలెత్తితే అందుకు హైవే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో మంగళవారం రాత్రి నుంచి టోల్‌ఫీజుల వసూళ్లు నిలిచిపోయాయి. బుధవారం సిబ్బంది కూడా రాకపోవడంతో టోల్‌బూత్‌లు ఖాళీగా దర్శనమిచ్చాయి. టోల్‌ఫీజుల వసూలు నిలిపివేయడంతో వాహన చోదకులు ఆనందం వ్యక్తంచేశారు.

డ్యామేజీని సరిచేస్తున్నాం: ఎన్‌హెచ్‌ఏ పీడీ

ఈ విషయమై నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ రంజన్‌ను వివరణ కోరగా...అగనంపూడి టోల్ గేట్ కొంత దెబ్బతిందన్నారు. ఆ డ్యామేజీని సరిదిద్దే పనిని చేపట్టినట్టు వెల్లడించారు. టోల్‌గేట్ నిర్వహణపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామని, ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

ఉల్లంఘనులపై విచారణ

... 3వ పేజీ తరువాయి

శాఖ నుంచి అనుమతి తీసుకుని రూ.రెండు కోట్లు రాయిల్టీగా చెల్లించింది. అయితే ప్రభుత్వం మారిన నేపథ్యంలో పలువురు ఆ స్థలంలో క్వారీయింగ్‌పై ఫిర్యాదులు చేయడంతో బుధవారం గనుల శాఖ అధికారులు సర్వే ప్రారంభించారు. తీసుకున్న తాత్కాలిక పర్మిట్లకు లోబడే తవ్వకాలు జరిపారా? లేక అదనంగా తవ్వారా? అనేది తేల్చడానికి సర్వే చేస్తున్నామని, ఇందుకు రెండు రోజులు సమయం పడుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే పెందుర్తి మండలం గుర్రంపాలెం ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో పలువురికి స్థలాలు కేటాయించారు. ప్లాట్లు చదును సమయంలో లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న కొండ, సమీపంలో భూముల నుంచి మట్టిని తరలించారు. కొండ నుంచి మట్టి తరలింపునకు ఎటువంటి పర్మిట్లు తీసుకోలేదు. ఏపీఐఐసీ అధికారులు, సిబ్బంది ప్రోత్సాహంతోనే అక్కడ తవ్వకాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదిలావుండగా పరవాడ మండలంలో రెండుచోట్ల గనుల శాఖ ఇచ్చిన క్వారీల్లో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదుపై విచారణ చేపట్టనున్నారు. మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు తన కుమారుడి పేరిట గ్రావెల్ క్వారీ తీసుకున్నారు. ఇంకా తాడిలో మరో గ్రావెల్ క్వారీ ఉంది. ఈ రెండు క్వారీల్లో జారీచేసిన పర్మిట్లకు మించి తవ్వకాలు చేపట్టారని ఫిర్యాదు అందినందున త్వరలో విచారణ చేస్తామని గనుల శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇంకా ఉమ్మడి జిల్లాలో మరికొన్ని క్వారీలపై కూడా ఫిర్యాదులు అందాయని, అయితే వాటి వివరాలు ప్రభుత్వం నుంచి రావలసి ఉందని చెబుతున్నారు.

రాజీనామాకు ససేమిరా?

... 3వ పేజీ తరువాయి

ఏలవచ్చునని భ్రమించారు. వైసీపీ ఓడిపోయినా కుర్చీ వదలడం లేదు. గవర్నర్ నియామకం ద్వారా తనకు పదవి వచ్చింది కాబట్టి ప్రభుత్వం దానిని రద్దు చేయలేదని ఆయన సన్నిహితుల వద్ద చెబుతున్నారు. ఒకవేళ రాజీనామా చేయాలని ఆర్డర్ ఇస్తే, అది చెల్లదంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని అంటున్నట్టు తెలిసింది. తనను వేధిస్తే ఏ విధంగా ఎదుర్కోవాలో తెలుసునని చెబుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై వాట్సాప్ గ్రూపుల్లో రిటైర్డ్ ఏయూ ఉద్యోగులు చాలా ఘాటుగా స్పందిస్తున్నారు. ప్రసాదరెడ్డి పవర్ మాంగర్ (పదవీ వ్యామోహం కలిగినవాడు) అని ఒకరు విమర్శించారు. ఇంకొకరు ఆయన్ను మామూలుగా పంపకూడదని, బలవం తంగా గెంటాలని సూచించారు. ఒక విద్యా సంస్థకు అధిపతిగా వ్యవహరిస్తున్న ఆయనపై ఉద్యోగులలో ఇంత వ్యతిరేకత ఉందా?...అని అంతా ఆశ్చర్య పోతున్నారు.


పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కళాశాల సమస్యలపై 'పల్లా'కు వినతి

అగనంపూడి, జూన్ 26: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు బుధవారం ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపక సిబ్బంది వినతిపత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై పల్లా స్పందించి కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే స్థానిక పశువైద్యాధికారి లావణ్య ఎమ్మెల్యేను కలిసి పశువుల ఆస్పత్రి నిర్మాణానికి చొరవ చూపాలని, పశువుల ఆస్పత్రికి సరైన భవనం లేనందున సిబ్బందితో పాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గొల్లవిల్లి కనకభవానీ, బి.సత్యనారాయణ, బండారు చందు, సత్యవతి, నక్కా లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డాక్‌యార్డులో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని..

మల్కాపురం: నేవల్ డాక్‌యార్డులో ఖాళీగా ఉన్న వందలాది ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు నేవల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టర్ విధానాన్ని రద్దు చేయాలని, ఆఫ్ లోడింగ్‌ను పూర్తిగా నిలిపివేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యోగులు విధులకు హాజరయ్యే సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే గణబాబుకు సత్కారం

గోపాలపట్నం, జూన్ 26: కూటమి మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాల్లో బ్రాహ్మణుల సంక్షేమానికి చేసిన హామీలను నెరవేర్చడానికి టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. గోపాలపట్నానికి చెందిన బ్రాహ్మణ సాధికార సమితి ప్రతినిధులు బుధవారం గణబాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాల పేదలకు మేలు జరిగే పథకాలను టీడీపీ ప్రభుత్వం సంపూర్ణంగా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు గణేశ్‌కుమార్, శ్రీనివాస్, శివ గణేశ్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

'మౌలిక వసతుల కల్పనకు కృషి'

అగనంపూడి, జూన్ 26: గ్రామాల్లో మౌలిక వసతిల కల్పనకు తగిన చర్యలు చేపడతానని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఇక్కడి అన్నపూర్ణానగర్‌లో గల మహాగణపతి ఆలయం వద్ద జీవీఎంసీ నిధులతో బోర్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అండతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నాయకులు మాడిశ వెంకటరావు, కె.జగదీశ్, ఎస్.సింహాచలం, డి.సన్యాసిరావు, పుష్ప, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'ఏయూ వీసీ, రిజిస్ట్రార్ రాజీనామా చేయాలి'

వెంకోజీపాలెం, జూన్ 26: ఏయూ వీసీ, రిజిస్ట్రార్‌ను వెంటనే మార్పు చేయాలని ఏయూ పరిరక్షణ సమితి సభ్యుడు ప్రొఫెసర్ సూరప్పడు ప్రభుత్వాన్ని కోరారు. రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన బుధవారం 12వ రోజుకు చేరింది. అడ్డగోలుగా వ్యవహరించిన వీసీ, రిజిస్ట్రార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తొలగించిన అసిస్టెంట్, కాంట్రాక్టు ప్రొఫెసర్‌లను విధుల్లోకి తీసుకోవాలని అసిస్టెంట్ కాంట్రాక్టు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ అర్జున్ అన్నారు. గెస్ట్ ఫ్యాకల్టీలను విధుల్లోకి తీసుకుని, కన్సాలిడేటెడ్ పే ఇవ్వాలని సురేష్ మీనన్ కోరారు. కృష్ణా యూనివర్సిటీ నుంచి వచ్చిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను వెనక్కి పంపాలని పొన్నాడ శ్రీను డిమాండ్ చేశారు. డాక్టర్ భాను, డాక్టర్ కల్యాణి, డాక్టర్ దాస్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మహారాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఓఎంజి :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 57, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 30, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 30, క్యారేట్ 38, దొండకాయలు 28, బంగాళదుంపలు 32, అరటికాయ (పెద్దది)6, అల్లం (పాతది) 160, మునక్కాడలు (కిలో) 150, బరబాటి 60, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 38, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 34, కీరదోస 30, క్యాప్సికమ్ 74, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 38, కంద 60, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట)3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8లో..


ప్రజలు, అధికారులు, తదితరులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే గణబాబు


ర్యాలీలో పాల్గొన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, విద్యార్థులు

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు

పలుచోట్ల ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

ఎన్ఏడీ జంక్షన్, జూన్ 26: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు సూచించారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎయిర్‌పోర్టు స్టేషన్ పోలీసులు ఎన్ఏడీ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ, బాగా చదువుకొని ఉన్నతస్థానంలో ఉండేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం పోలీసులు, ప్రజలు, విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో డీసీపీ మోకా సత్తిబాబు, వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, విద్యార్థులతో పాటు టీడీపీ నాయకులు వై.తిరుమలరావు, పి.అజయ్, మందలపు వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.


పెందుర్తి సెబ్ ఇన్‌స్పెక్టర్ సరోజాదేవి ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పెందుర్తి: ఎక్కడైనా మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలు జరుగుతున్నట్టు తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 14500కు కాల్ చేయవలసిందిగా విశాఖ సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పర్యవేక్షణాధికారి, పెందుర్తి సెబ్ ఇన్‌స్పెక్టర్ సరోజాదేవి కోరారు. సెబ్ (పెందుర్తి) ఆధ్వర్యంలో ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మత్తుతో యువత భవిత చిత్తు కారాదని, మత్తుకు బానిసవుతున్న యువత శారీరక, మానసిక ఆరోగ్యం దుష్ప్రభావాలు చూపిస్తాయని వివరిస్తూ ప్లకార్డులు, బ్యానర్లను ప్రదర్శిస్తూ పెందుర్తి కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా సరోజాదేవి మాట్లాడతూ గంజాయి, తదితర మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేశ్, పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్కాపురం: యువత మత్తు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒత్తిడి, పలు వైఫల్యాల వల్ల యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారన్నారు. యువత మంచి లక్ష్యాన్ని ఏర్పరుచుకుని వాటి సాధన కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు వై.అనసూయాదేవి, అంజలిదేవి, నదియా, సంధ్యారాణి, ప్రిన్సిపాళ్లు డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, సిస్టర్ కేస్లిన్, తదితరులు పాల్గొనారు.

గోపాలపట్నం: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉంటూ ఆరోగ్య భారత్ నిర్మాణం కోసం కృషి చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఎం.కృష్ణకుమారి పిలుపునిచ్చారు. ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు, మాదకద్రవ్యాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును దూరం చేసుకోవద్దన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యంతో పాటు కుటుంబ వ్యవస్థ కూడా నాశనమవుతుందన్న విషయాన్ని గ్రహించాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


వర్షానికి పెందుర్తిలో జలమయమైన రహదారి


గోపాలపట్నం శ్మశానవాటిక కూడలిలో బీఆర్‌టీఎస్ రోడ్డుపై చేరిన వర్షపు నీరు

భారీ వర్షంతో జలమయమైన లోతట్టు ప్రాంతాలు

ఇబ్బందులకు గురైన వాహనదారులు, పాదచారులు

పలుచోట్ల ఉధృతంగా ప్రవహించిన గెడ్డలు

గోపాలపట్నం, జూన్ 26: నగరంలో పలుచోట్ల బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం ఐదు గంటల తర్వాత కురిసిన వర్షానికి గోపాలపట్నం పరిసర ప్రాంతాలు తడిసిముద్దయ్యాయి. పలుచోట్ల గెడ్డలు ఉధృతంగా ప్రవహించాయి. గోపాలపట్నం కొండవాలు ప్రాంతాల నుంచి ప్రవహించిన వర్షపు నీటితో కొత్తపాలెంలోని ప్రధాన గెడ్డ పొంగి ప్రవహించింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వర్షపు నీరు కొత్తపాలెం శివారులోని వ్యవసాయ క్షేత్రాలలో చేరింది. ఈ ప్రాంతంలో గెడ్డల ఆధునీకరణ పనులు చేపట్టకపోవడంతో కొత్తపాలెం శివారులో రహదారిపై వరద నీరు పొంగి ప్రవహించడంతో కొత్తపాలెం-నరవ గ్రామాల మధ్య రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొత్తపాలెం అండర్‌పాత్‌వేలో వర్షపునీరు నిల్వ చేరింది. గోపాలపట్నం కొండవాలు ప్రాంతాల్లో పలుచోట్ల రిటెయినింగ్ వాల్స్ నిర్మాణం జరగకపోవడంతో కొండచరియలు జారిపడే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌టీఎస్‌పై రోడ్డులో పలుచోట్ల వాన నీరు తిష్ట వేసింది. స్థానిక ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న బస్టాప్ వద్ద నీరు నిల్వ చేరడంతో బస్సులు ఎక్కి, దిగే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. అలాగే శ్మశానవాటిక కూడలిలో కూడా బీఆర్‌టీఎస్‌పై వర్షపు నీరు పెద్దఎత్తున చేరడంతో వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు.


అగనంపూడలో కురుస్తున్న వర్షం

పెందుర్తి: పెందుర్తి పరిసరాల్లో ఏకధాటిగా గంట పాటు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో పడిన వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. పలు కాలనీల్లో రహదారులపై వాన నీరు పొంగి ప్రవహించింది. పలు కాలనీల్లోని మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి జలమయంగా మారింది. నీరు ప్రవహించే మార్గం లేక రోడ్డుపైనే వాన నీరు నిలిచిపోయింది.

అగనంపూడి: అగనంపూడి, ఉక్కు నిర్వాసిత ప్రాంతాలు, ఫార్మాసిటీ పునరావాస కాలనీల పరిసర ప్రాంతాల్లో సుమారు రెండు గంటలపాటు కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారుల పైనుంచి వర్షపు నీరు పెద్దఎత్తున పారింది. మధ్యాహ్నం వరకు తీవ్ర ఉక్కపోత, ఎండతో అవస్థల పడిన ప్రజలు ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని వాతావరణం చల్లబడి భారీ వర్షం కురవడంతో ఊరట లభించింది. వర్షం కారణంగా వారపు సంతకు వచ్చే కొనుగోళ దారులు అవస్థలు పడ్డారు. ఇదిలావుండగా నిర్వాసిత కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో వర్షానికి మురుగు నీరంతా రహదారులపైకి రావడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు డి.లీలామాధవరావు

సింహాచలం, జూన్ 26: ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని రేషన్ డీలర్ల రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు డి.లీలా మాధవరావు కోరారు. సింహాచలంలోని ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన డీలర్ల విస్తృతస్థాయి సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. ఆహార భద్రత చట్టం ప్రకారం సరకులను డీలర్ల ద్వారా మాత్రమే పంపిణీకి చర్యలు చేపట్టాలని, రూ.1500లు గౌరవ వేతనంతోపాటు కమీషన్‌ను పెంచాలని, జీఓ నంబర్-5ను తక్షణమే అమలు చేయాలని, రేషన్ షాపులను విలేజ్ మాల్స్‌గా మార్చాలని, సామాజిక పంపిణీ బాధ్యతలను డీలర్లకు అప్పగించాలని సమావేశంలో తీర్మానించారు. కాగా విశాఖ జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడిగా గంట్యాడ అప్పలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జీవన్‌కుమార్‌ను, ప్రధానకార్యదర్శిగా నాగేశ్వరరావు, కోశాధికారిగా కె.శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు లీలామాధవరావు ప్రకటించారు.


సమావేశంలో మాట్లాడుతున్న లీలామాధవరావు

బైకుల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

విశాఖపట్నం, జూన్ 26: నగరంలో పలు పోలీసు స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు క్రైం డీసీపీ వి. వెంకటరత్నం తెలిపారు. బుధవారం పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. నగరంలోని న్యూ పోర్టు, మహారాణిపేట, కంచరపాలెం, పోర్ట్‌టౌన్, పెదగంట్యాడ పెందుర్తి, మల్కాపురం పోలీసు స్టేషన్ల పరిధిలో పలు ప్రాంతాల్లో తాళాలు వేసి ఉన్న షాపుల షట్టర్లు తొలగించి బైక్‌లను అపహరించుకుపోయారు. వీటిపై పలువురు ఫిర్యాదులు చేయటంతో కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో స్పెషల్ క్రైమ్ పోలీసు టీం ద్వారా దర్యాప్తు నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం పెదగంట్యాడకు చెందిన చిత్తారపు అభిషేక్ (19), పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన కిం గం హరి గణేష్ (18), జువ్వాల అశోక్ (18)లను అదుపులోకి తీసుకొని విచారించారు. వారు నేరం అంగీకరించటంతో 13 కేసులలో మొత్తం రూ. 2,70,800 లక్షల సొత్తు చోరీ కాగా, నిందితులనుంచి రూ. 2,41,500 లక్షల సొత్తును రికవరీ చేసినట్టు డీసీపీ తెలిపారు. విశాఖకు చెందిన చిత్తారపు అభిషేక్ భీమవరంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లినప్పుడు అక్కడ గ ణేష్, అశోక్ పరిచయం అయ్యారు. మద్యం, గంజాయి, విలాసాలకు అలవాటుపడిన వీరు సులభంగా డబ్బు సంపాదించా లనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడుతున్నట్టు తెలిపారు డీసీపీ తెలిపారు. ఈ ముగ్గురినీ అరెస్టు చేసి రి మాండ్‌కు తరలించినట్టు చెప్పారు.


వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ వెంకటరత్నం

ఆక్రమణలకు గురవుతున్న తోకాడ చెరువు

అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి

ఆటోనగర్, జూన్ 26: జీవీఎంసీ 59వ వార్డు పరిధిలోని తోకాడ చెరువు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ చెరువును ఒకవైపు డెబ్రిస్, ఇతర వ్యర్థాలతో పూడ్చివేస్తూ.. ఆ తర్వాత చదును చేసి కబ్జాదారులు ఆక్రమిస్తున్నారు. సర్వే నంబర్-49లో 5.38 ఎకరాల్లో ఉన్న ఈ చెరువు ఆక్రమణలకు గురైతే వర్షపు నీరు నిల్వ సామర్థ్యం తగ్గిపోయి భవిష్యత్తులో తోకాడ కాలనీకి తాగునీటి ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వానాకాలంలో తోకాడ కాలనీలో కురిసే వర్షపు నీరంతా ఈ చెరువులోకే చేరుతుంది. ఒకవేళ చెరువు నిండిపోతే కాలువ ద్వారా పక్కనే ఉన్న పెద్ద చెరువులోకి నీరు చేరుతుంది. దీనివల్ల కాలనీవాసులకు వర్షపు నీటి ముప్పు ఉండేది కాదు. చెరువు ఆక్రమణకు గురైతే మాత్రం కాలనీకి వర్షపు నీటి ముప్పు ఏర్పడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు స్పందించి తోకాడ చెరువు ఆక్రమణలకు గురికాకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


డెబ్రిస్, ఇతర వ్యర్థాలతో చెరువును పూడ్చివేస్తున్న దృశ్యం


చలపతిరావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

పీవీ చలపతిరావు జీవితం ఆదర్శనీయం

బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, జూన్ 26: మాజీ ఎమ్మెల్సీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీజేపీ తొలి అధ్యక్షుడు దివంగత పీవీ చలపతిరావు జీవితం ఆదర్శనీయమైనదని భారతీయ జనతా పార్టీ గాజువాక నియోజవకర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ఇక్కడి బీజేపీ కార్యాలయంలో బుధవారం పీవీ చలపతిరావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కరణంరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేసిన ఘనత పీవీ చలపతిరావుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొండా యల్లాజీరావు, పి.నాగేశ్వరరావు, కోసూరు తాతారావు, పేర్ల అప్పారావు, వెంకటరావు, గురప్ప, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలి

అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథన్


ప్రజలతో మాట్లాడుతున్న విశ్వనాథన్

గాజువాక, జూన్ 26: జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో ఎక్కడ పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథన్ అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. బుధవారం ఆయన జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాన కాలువలను పరిశీలించి వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూడికలు తీయాలని సూచించారు. పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని, ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని, వీధులను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు. స్థానికంగా ఉన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, ఏఎంహెచ్‌ఓ కిరణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావుకు అవార్డు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 26: ప్రశాంత ఎన్నికల నిర్వహణలో ప్రతిభ కనబరిచిన స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావును నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ అభినందించి అవార్డు అందజేశారు. ఎన్నికల సమయంలో ఎక్కడ ఎటువంటి సంఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు ఎన్నికల తర్వాత పోలింగ్ సామగ్రిని తరలించేటప్పుడు తీసుకున్న చర్యలకు గాను ఆయనకు అవార్డు లభించింది. ఈ సందర్భంగా సీఐకు పలువురు అభినందనలు తెలిపారు.


సీపీ రవిశంకర్ చేతులమీదగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సీఐ

'ఉక్కును పూర్తి సామర్థ్యంతో నడపాలి'

కూర్మన్నపాలె, జూన్ 26: స్టీల్‌ప్లాంటును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తి సామర్థ్యంతో నడపాలని, కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని స్టీల్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,231వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ 1982 వరకు సెయిల్‌లో ఉన్న స్టీల్‌ప్లాంటును విడదీసి ఆర్ఐఎన్ఎల్‌గా ఏర్పాటు చేశారన్నారు. సెయిల్ నుంచి ఉక్కు కర్మాగారాన్ని విడదీసే క్రమంలో అందుకు అవసరమైన వనరులు కేటాయిస్తామని, బైలదిల్లాలో ఉన్న బ్లాక్4 ఇనుప గనులను ప్లాంటుకు కేటాయిస్తామని, సెయిల్‌లోని అన్ని వసతులను కార్మికులకు అమలు చేస్తామని నాటి ప్రభుత్వం హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం స్టీల్‌ప్లాంటుకు అవసరమైన ముడిసరకు లేక ఉత్పత్తిని తగ్గించుకోవలసిన దుస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం తమ హామీలను నిలబెట్టుకోలేనందున స్టీల్‌ప్లాంటును తిరిగి సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడిచేలా కృషి చేయాలని కోరారు. నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, విళ్లా రామ్మోహన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలి


లక్ష్మీపురం ఎంపీపీ పాఠశాలలో మొక్క నాటుతున్న దృశ్యం

గోపాలపట్నం, జూన్ 26: పర్యావరణాన్ని కాపాడుకుంటేనే జలవనరుల పరిరక్షణ సాధ్యమవుతుందని లక్ష్మీనగర్ ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం ఎం.మోహనరావు అన్నారు. బుధవారం పాఠశాలలో నీటి పొదుపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారకుండా ఉండాలంటే ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు నీటి వనరులను కాపాడాలని కోరారు. నీటి పొదుపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్న యాగశాల నిర్మాణానికి సహకరిస్తా

సినీ దర్శకుడు అనిల్ రావిపూడి

సింహచలం, జూన్ 26: వరాహలక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో నిత్య, వార, పక్ష, మాస, విశేష ఉత్సవాల వేళ జరిపే హోమాలకు వీలుగా శాశ్వత ప్రాతిపదికన యాగశాల నిర్మాణం కానుంది. దేవస్థానం అధికారుల ప్రతిపాదనకు టాలీవుడ్ దర్శకుడు అనిల్ రావిపూడి సమ్మతించారు. 'సంక్రాంతికి వస్తున్నాం' వర్కింగ్ టైటిల్‌తో వెంకటేష్‌తో తీయనున్న తాజా చిత్రం స్క్రిప్ట్‌నకు పూజలు చేయించేందుకు బుధవారం సింహగిరికి వచ్చిన ఆయనకు పర్యవేక్షణాధికారి పిళ్లా శ్రీనివాస్ యాగశాల విశిష్టతను వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన అనిల్ రావిపూడి నిర్మాత దిల్‌రాజ్‌తో కలిసి ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు.


యాగశాల గురించి అనిల్ రావిపూడికి వివరిస్తున్న పర్యవేక్షణాధికారి శ్రీనివాస్

1011 మందికి ఐటీఐల్లో సీట్లు కేటాయింపు

ముగిసిన మొదటి విడత కౌన్సెలింగ్

కంచరపాలెం, జూన్ 26 : కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభమైన మొదటి విడత ఐటీఐ కౌన్సెలింగ్ బుధవారంతో ముగిసింది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాల కోసం 3398 మంది అభ్యర్థులు ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకున్నారు. వీరిలో వారం రోజుల నుంచి జరిగిన కౌన్సెలింగ్‌నకు 1764 మంది హాజరయ్యారు. మెరిట్, రోస్టర్ ఆధారంగా ఎలక్ట్రికల్, ఫిట్టర్ డీజిల్ మెకానిక్, వెల్డర్, కార్పెంటర్, ఫంబర్ తదితర ట్రేడుల్లో 1011మందికి సీట్లను కేటాయించినట్టు ఐటీఐ ప్రవేశాల జిల్లా కన్వీనర్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా ఐటీఐల్లో తక్షణమే రిపోర్టు చేయాలని ఆయన సూచించారు. నూతన విద్యాసంవత్సరం తరగతులు రెండు రోజుల్లో ప్రారంభం కానున్నాయన్నారు.

అలరించిన పౌరాణిక నాటకం



నాటకంలో ఓ సన్నివేశం

అక్కయ్యపాలెం, జూన్ 26: గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి లలితాపీఠంలో డాక్టర్ మీగడ రామలింగస్వామి బృందంతో భక్తనత్కీర నాటక ప్రదర్శన జరిగింది. ధూర్జటి శ్రీకాళహస్తి మహత్యం కావ్యం ఆధారంగా రామలింగస్వామి రచించిన ఈ నాటకం ప్రేక్షకులను రంజింప చేసింది. పలు నంది పురస్కారాలు స్వీకరించిన రామలింగస్వామి నత్కీరుడి పాత్ర పోషించారు. పాండ్య రాజుగా వి.సత్యం, నారదునిగా డాక్టర్ అత్తిలి శంకర్ తదితర నటులు చక్కని నటనతో రసోచితమైన పద్యపఠనంతో ఆద్యంతం ప్రేక్షకులను అలరించారు. మీగడ మల్లికార్జున స్వామి తదితరులు వాద్య సహకారం అందించారు. ప్రదర్శన అనంతరం కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ స్వామి నాటక బృందాన్ని సత్కరించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

అక్కయ్యపాలెం, జూన్ 26 : టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ వారు నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశం కల్పించనున్నట్టు సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాయక్ తెలిపారు. ఇంటర్ పాస్, డిగ్రీ అయిన 18 నుంచి 28 ఏళ్ల వయస్సు లోపు యువతీ, యువకులకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి, ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్‌నెట్ కాన్సెప్ట్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ అందించి అనంతరం ఉపాధి అవకాశాలు చూపుతామన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఎన్ఏడీ బాజీ జంక్షన్‌లోని నిర్మాణ ఆర్గనైజేషన్ కేంద్రంలో కానీ, లేదా ఫోన్: 95028 74304, 99081 04113లలో 30వ తేదీ లోగా సంప్రదించాలని కోరారు.

రచయితలకు సామాజిక బాధ్యత అవసరం



మాట్లాడుతున్న రచయిత డాక్టర్ సుగుణరావు

సీతంపేట, జూన్ 26: రచయితలకు సామాజిక బాధ్యత ఉండాలని రచయిత ఎం.సుగుణరావు తెలిపారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ డిగ్రీ కళాశాలలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో కథా కచేరీ నిర్వహించారు. పలు కథలను రచయితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా సుగుణరావు మాట్లాడుతూ, కథలు ఎక్కడినుంచో రావని, జీవిత అనుభవాల్లోని అంశాలే ముడిసరకు అని అన్నారు. దళిత, మహిళల సమస్యలను తెలుసుకోవాలని కోరారు.రాజకీయ, సామాజిక అంశాలను, సమస్యలను ఆకళింపు చేసుకుంటే చక్కటి సృజన కారుడు అవు తాడన్నారు.సభకు అధ్యక్షత వహించిన సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథల్లో శిల్పం సరిగా లేకపోతే కథనం దెబ్బతింటుందన్నారు. యువ రచయితలకు సాధన ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా డాక్టర్ సూరపనేని విజయకుమార్, సంస్థ కార్యదర్శి సీహెచ్ చిన సూర్యానారయణ, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత, డాక్టర్ కె.వి.ఎస్. మూర్తి, పి.పి. ఆర్. కుమారరావు, పరమేశ్వరరావు, బి.రాధామణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలాస, గుణుపూర్, కోరాపుట్ పాసింజర్ రైళ్లు రద్దు

విశాఖపట్నం, జూన్ 26: పూండి, నౌపడ మెయిన్ లైనులో భద్రతా ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 27న (గురువారం) పలాస-విశాఖ (07471), విశాఖ-పలాస (07470), విశాఖ - గుణుపూర్ (08522), గుణుపూర్- విశాఖ (08521), కోరాపుట్- విశాఖ (08545) పాసింజర్ రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. అలాగే, గురువారం పలు ఒరిజినేటింగ్ రైళ్లను రీ షెడ్యూల్ చేయడంతో భువనేశ్వర్ - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (12830) మూడు గంటలు ఆలస్యంగా, రాయపూర్-విశాఖ పాసింజర్ (08527) రెం డు గంటలు, టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరుతాయని పేర్కొన్నారు.

ఇకపై వివేక్ ఎక్స్‌ప్రెస్ డైలీ

డిబ్రుగర్, కన్యాకుమారి మధ్య వారానికి ఐదు రోజులు నడుస్తున్న వివేక్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను (22504/ 22503) ప్రయాణికుల డిమాండ్ మేరకు డైలీ (ప్రతిరోజు) ఎక్స్‌ప్రెస్‌గా ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. డిబ్రుగర్ - కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504) రైలు జూలై ఎనిమిది నుంచి, తిరుగు ప్రయాణంలోని కన్యాకుమారి- డిబ్రుగర్ వివేక్ ఎక్స్‌ప్రెస్ (22503) రైలు జూలై 12వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

అనుమతుల్లేని వైసీపీ కార్యాలయాలు కూల్చివేయాలి

- దసపల్లా భూముల డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ రద్దు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనుమతులు లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయాలను తక్షణమే కూల్చివేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి జిల్లాల్లో ప్రభుత్వ సొమ్ముతో రుషికొండ ప్యాలెస్‌ను మించి వైసీపీ కార్యాలయాలు నిర్మించారన్నారు. కొన్నిచోట్ల ప్రైవేటు స్థలాలు కబ్జాచేశారన్నారు. అనకాపల్లిలో కాపు భవన్‌కు కేటాయించిన స్థలంలో వైసీపీ కార్యాలయం నిర్మించారని రాష్ట్ర వ్యాప్తంగా 42.44 ఎకరాల ప్రభుత్వ భూములు తీసుకున్నారన్నారు. వైసీపీ పాలనలో అన్ని అనుమతులు ఉన్న టీడీపీ నాయకుల భవనాలు కూల్చివేసి ఇష్టానుసారంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. అనుమతుల్లేని వైసీపీ భవనాలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఐదేళ్లలో రాక్షస ముఖ్యమంత్రి పాలించారని, ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పుతో జగన్‌ను ఇంటికి పంపినా అతనిలో తలపొగరు తగ్గలేదన్నారు. విశాఖలో హయగ్రీవ, సీబీఎన్‌సీ భూముల్లో చేపడుతున్న నిర్మాణాలపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించిందన్నారు. దసపల్లా భూములపైనా చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో దక్షిణ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్‌లీడరు పీలా శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గండి బాబ్జీ

కనకమహాలక్ష్మి ఆలయానికి విరాళంగా భవనం



ఇంటిని రాసిచ్చిన గంటి కుటుంబీకులతో ఈవో శ్రీనివాసులురెడ్డి, అధికారులు

జగదాంబ కూడలి, జూన్ 26: వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం విస్తరణకు గంటి కామేశ్వరరావు, ప్రభాకర్, అరుణ్‌కుమార్, శ్యామలాదేవి కుటుంబ సభ్యులు రూ. 40 లక్షల విలువ చేసే గృహాన్ని దేవదాయ శాఖ సహాయక మిషనర్, ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డికి, సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరావుకు అందజేశారు. గురువారం ఈవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గంటి కుటుంబీకులు ఇంటికి సంబంధించి ఆస్తి పత్రాలిచ్చి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయానికి సమీపాన ఉన్న పల్లవారివీధి, డోర్ నెంబరు 25-5-1లో 83.33 చ.గ విస్తీర్ణంలో ఉన్న గ్రౌండ్, మొదటి అంతస్తు కలిగిన గృహాన్ని అమ్మవారి పేరు మీద సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో గురువారం రిజిస్ట్రేషన్ చేయించి వాటికి సంబంధించిన పత్రాలు, ఇంటి తాళాలను ఆలయ ఈవోకు అందజేశారు. ఈనేపథ్యంలో ఈవో శ్రీనివాసుల రెడ్డి వారిని అభినందించారు. ఈ ఇంటిని అమ్మవారి ఆలయ విస్తరణ కోసం వినియోగిస్తామన్నారు.

కూరగాయల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి

సీత మ్మధార, జూన్ 26: సీతమ్మధార రైతుబజార్‌లో ఉద్యనవన శాఖ కూరగాయల సాగుపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి ఎస్‌కే యాసిన్, జిల్లా ఉద్యానవన అధికారి కె. సత్యానారాయణ రెడ్డి రైతులకు పలు అంశాలను వివరించారు. పందిరి కూరగాయల సాగు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కూరగాయలు, మల్చర్ సాగు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న పంట రాయితీలను వివరించారు.రైతుబజార్ ఎస్టేట్ అధికారి పి.కొండబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఉద్యాన అధికారి జి.సోని,సహయకుడు కె.సతీష్ పాల్గొన్నారు.

ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా రేపు

కంచరపాలెం, జూన్ 26 : కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 28వ తేదీన జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధికల్పనాధికారి సీహెచ్.సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జాబ్‌డీలర్స్, జయభేరి, క్రెడిట్ యాక్సస్ గ్రామీణ్ లిమిటెడ్, మెడ్ ప్లస్ తదితర కంపెనీలు పాల్గొననున్నాయి. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఫార్మసీ కోర్సులు పూర్తిచేసిన యువత హాజరుకావచ్చు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ముందుగా నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో తమ వివరాలను అప్‌లోడ్ చేయాలని సుబ్బిరెడ్డి సూచించారు.అన్నీ ధ్రువపత్రాలతో శుక్రవారం ఉదయం 9గంటలకు ఉపాధి కార్యాలయం వద్దకు హాజరుకావాలని కోరారు.

ఆర్‌బీఎంయూపీ పాఠశాలలో ప్రవేశాలు

డాబాగార్డెన్స్, జూన్ 26: గ్రేటర్ 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని రమాదేవి బానోజీ ప్రాథమికోన్నత పాఠశాల (ఆర్‌బీఎంయుపీ)లో అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రధానోపాధ్యాయులు హనుమంతు ప్రభాకర్ తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఎనిమిది తరగతి వరకు విద్యార్థులు ప్రవేశం పొందాలని కోరారు. అడ్మిషన్లు కోరే వారు విద్యార్థి ఆధార్‌కార్డు, తల్లి, తండ్రి ఆధార్‌కార్డులు, తెలుపు రేషన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ ద్వారా అందించాలని సూచించారు.

మీ సేవ నిర్వాహకులకు న్యాయం చేస్తాం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న మీసేవ నిర్వాహకులు

జ్ఞానాపురం, జూన్ 26: ఎన్నికలకు ముందు యువగళంలో టీడీపీ యువ నాయకుడు లోకేశ్ మీసేవ నిర్వాహకులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తప్పక నెరవేర్చనుందని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆయన రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడిగా గురువారం ప్రమాణస్వీకారం చేయనున్న సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా మీసేవ నిర్వాహకులు బుధవారం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. అలాగే, మీ సేవ కేంద్రాలకు పూర్వ వైభవం తెచ్చే విధంగా కృషి చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో రాష్ట్ర వ్యాప్తంగా 11 వేల మీసేవ కేంద్రాల నిర్వాహకులు వీధిన పడ్డారన్నారు. వీరికి సరైన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి వందలాది రూ. కోట్లు ఆదాయాన్ని అందించే మీసేవ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవ సరం ఉందని, అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారన్నారు. ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మీసేవ ప్రతినిధులు రొంగళి గంగా భవాని, మళ్ల మోహన్, చదరం తులసీరాం, చందు, విజయలత, రూప, గణేష్ పాల్గొన్నారు.

పోర్టులో నూతన అగ్నిమాపక వాహనాలు ప్రారంభం



అగ్నిమాపక వాహనాలు ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం అంగముత్తు

విశాఖపట్నం, జూన్ 26: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆటోమోటివ్ విభాగంలో రెండు అధునాతన అగ్నిమాపక వాహనాలు చేరాయి. వీటిని పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు బుధవారం ప్రారంభించారు. చెన్నైకు చెందిన ఏబీ ఎస్ మెరైన్ సర్వీసెస్ లిమిటెడ్ నుంచి వీటిని ఐదేళ్ల కాలానికి పోర్టు అద్దెకు తీసుకుంది. ఒక్కో వాహనం నెలవారీ అద్దె రూ.5,84,100. వివిధ రకాల అగ్నిప్రమాదాలను నివారించేందుకు ఇవి పనిచేస్తాయి. పోర్టు అగ్నిమాపక సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగు పరిచేందుకు దోహదపడతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. పోర్టు అవసరాలతో పాటు ప్రభుత్వరంగ సంస్థలకు అత్యవసర సమయాల్లో సేవలందిస్తాయని చైర్మన్ వెల్లడించారు. కార్యక్రమంలో పలు విభాగాల అధిపతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్‌తో ముచ్చటగా మూడో చిత్రం

- 'సంక్రాంతికి వస్తున్నాం' వర్కింగ్ టైటిల్
- సినీ దర్శకుడు అనిల్ రావిపూడి
- సినిమా స్క్రిప్ట్‌కు సింహాచలం అప్పన్న సన్నిధిలో పూజలు

సింహాచలం, జూన్ 26: విక్టరీ వెంకటేష్‌తో తీస్తున్న మూడో సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. ఆ సినిమా స్క్రిప్ట్‌నకు సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో పూజలు చేయించేందుకు బుధవారం ఇక్కడకు చేరుకున్న ఆయనకు ఆలయ పర్యవేక్షణాధికారి పిళ్లా శ్రీనివాస్ స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలో పూజలు చేయించారు. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ ఇప్పటివరకు తన దర్శకత్వంలో తెరకెక్కిన ఏడు సినిమాల్లో వెంకటేష్‌తో చేసిన ఎఫ్-2, మహేష్‌బాబుతో తీసిన 'సరిలేరు నీకెవ్వరు' సినిమాలు సంక్రాంతి పండుగకే రిలీజై విజయవంతం అయ్యాయన్నారు. తాజాగా వెంకటేష్‌తో తీయనున్న చిత్రాన్ని కూడా 2025 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామన్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' అనే వర్కింగ్ టైటిల్‌తో జూలై, ఆగస్టు నెలల్లో సెట్స్ పైకి వెళ్లనున్న ఈ సినిమాలో వెంకటేశ్ సరసన మీనాక్షీ చౌదరి, ఐశ్వర్య రాజేష్ నటిస్తున్నారన్నారు. ధమాకా వంటి హిట్ సినిమాలకు బాణీలు సమకూర్చిన భీమ్స్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తారన్నారు. తొలిసినిమా పటాస్‌తో పాటు ఇప్పటివరకు తీసిన ఏడు సినిమాలకు వైజాగ్‌లోనే స్క్రిప్ట్‌కు తుదిమెరుగులు దిద్దడం, సింహాద్రి అప్పన్న సన్నిధిలో పూజలు చేయించడం ఆనవాయితీగా వస్తోందని, అదే ఒరవడిని కొనసాగించామన్నారు. కేరళ, పొలాచ్చిలోని పలు ప్రాంతాలతో పాటు విశాఖ మన్యంలో షూటింగ్ చేయాలని యోచిస్తున్నామన్నారు. చిత్ర కథా రచనలో సహకరిస్తున్న సాయికృష్ణ, నారాయణ, అంజు మహంకాళి, నాగ, కో-డైరెక్టర్ సూర్యతో కలిసి స్వామిని దర్శించుకున్న అనంతరం అనిల్ రావిపూడికి పండితులు వేదాశీర్వచనాలను, ప్రసాదాలను అందజేశారు.



సింహాద్రి అప్పన ఆలయ ఆవరణలో స్క్రిప్ట్‌తో అనిల్ రావిపూడి, సహచరులు

మాదక ద్రవ్య రహిత జిల్లాగా రూపొందిస్తాం



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టరేట్ ఉద్యోగులు

మహారాణిపేట, జూన్ 26: మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామని కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి కే మోహన్ కుమార్ అధికారులు, సిబ్బందితో కలసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ దేవ్‌ప్రసాద్, వివిధ విభాగాల పర్యవేక్షకులు సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

అక్కయ్యపాలెం: మాదక ద్రవాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రా ష్ట్ర వ్యాప్తంగా అనేక మంది చిన్నారులుమాదక ద్రవ్యాలకు అలవాటుపడుతున్న సంఘటనలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో అన్ని జిల్లాల పోలీసు, ఎస్ఈబీ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులను ఎప్పటికప్పుడు బాలల కమిషన్ అప్రమత్తం చేస్తుందని తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల కృషి చేయాలని కోరారు.

వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి మాజీ కమిషనర్‌కు వీడ్కోలు



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ అధికారులు

సిరిపురం, జూన్ 26: రెండేళ్ల వీఎంఆర్డీఏ ఇన్‌చార్జి కమిషనర్‌గా డా.ఎ.మల్లికార్జున అందించిన సేవలు ప్రశంసనీయమని అధికారులు కొనియాడారు. సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో బుధవారం సాయంత్రం మల్లికార్జున ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఆయన భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కీర్తి, సంయుక్త కమిషనర్ రవీంద్ర, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, చీఫ్ అకౌంటెంట్ హరిప్రసాద్, చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, కార్యనిర్వాహక ఇంజనీర్ బలరామరాజు, చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, డీఎఫ్ఓ శ్యామల, సిబ్బంది పాల్గొన్నారు.

పూడికల తొలగింపు

జగదాంబ కూడలి, జూన్ 25: ఫెర్రీ రోడ్డు, కోటవీధి ఏరియాల్లో అండర్ డ్రైన్లు, కాలువలు పూడికలను తొలగిస్తున్నారు. కొద్ది రోజుల కిందట ఈ ప్రాంతంలో పారిశుధ్య సమస్యను టీడీపీ స్థానిక ముస్లిం నాయకుడు లడ్డూ జీ వీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పలుచోట్ల పూడికలను యూసీడీ సిబ్బంది తొలగించే పనులు చేపడుతున్నారు.



పూడిక తొలగిస్తున్న కార్మికుడు

హోం మంత్రికి విద్యాశాఖాధికారుల అభినందన



హోంమంత్రి అనితతో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను పాఠశాల విద్యాశాఖ అధికారులు బుధవారం ఆమె ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి వచ్చిన అనిత హోంమంత్రిగా బాధ్యతలు అధిరోహించడంపై వారంతా శుభాభినందనలు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో విశాఖ ఆర్జేడీ జ్యోతికుమారి, డీఈవో చంద్రకళ, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీ శ్రీనివాసరావు ,ఉపాధ్యాయ సంఘనేతలు పైడిరాజు, రవి తదితరులున్నారు.

చట్ట సభల్లో అవకాశం కల్పించండి

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు మహ్మద్ నజీర్ వినతి

మహారాణిపేట, జూన్ 26: తనకు చట్ట సభల్లో అవకాశం కల్పించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. బుధవారం కుప్పంలో ముఖ్య మంత్రిని ఆయన మర్యాద పూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనేక సంవత్సరాలుగా పార్టీకి సేవలందించానని, ఈస్థితిలో తనకు చట్టసభలలో అవకాశం కల్పించాలని ఆయన అభ్యర్థించారు. ఈ సందర్భంగా చంద్రబాబు పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్టు నజీర్ తెలిపారు.



ముఖ్యమంత్రితో నజీర్

డివైడర్ తొలగింపుతో ఊరట



జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్తున్న వాహనదారులు

డాబాగార్డెన్స్, జూన్ 22: జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గమధ్యలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ డివైడర్‌ను ఎట్టకేలకు సంబంధిత అధికారులు తొలగించారు. ఇక్కడ డివైడర్ ఏర్పాటుతో వాహనదారులు చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొందరు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లాలంటే తమతో తెచ్చుకున్న లాగేజీని నెత్తిన పెట్టుకుని ఊసురుమంటూ వెళ్లిన సంఘటనలు కోకొల్లలున్నాయి. ఈ నేపథ్యంలో డివైడర్‌ను తొలగించడంతో రాకపోకలు సులభతరం కావడంతో పలువురు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఏబీవీపీ విభాగ్ సంఘటన కార్యదర్శిగా సాయికుమార్

డాబాగార్డెన్స్, జూన్ 26: తిరుపతిలో ఈ నెల 23 నుంచి 26 వరకు జరుగుతున్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత అభ్యాసవర్గం సాయికుమార్‌ను విశాఖ విభాగ్ కార్యదర్శిగా ఎంపిక చేసింది. 2019 నుంచి రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ ఏబీవీపీలో సాయికుమార్ అనేక బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తానని తెలిపారు.

టోల్‌గేటుపై దాగుడుమూతలు

... 3వ పేజీ తరువాయి

ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు మళ్లీ టోల్‌గేటును ఏర్పాటుచేశారు. గత ఐదేళ్లుగా వాహనాల నుంచి ఫీజు వసూలు చేస్తున్నారు. దీంతో తాము అధికారంలోకి వస్తే టోల్‌గేటు తొలగిస్తామని ఇటీవల ఎన్నికల ముందు పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కూటమి కార్యకర్తలు కొందరు మంగళవారం రాత్రి టోల్‌గేటు వద్ద ఆందోళన చేపట్టారు. స్టాపర్లు తొలగించి వాహనాల నుంచి ఫీజులు వసూలు చేయకుండా అడ్డుకున్నారు. అనంతరం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఫోన్‌లో మాట్లాడారు. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి నిర్మాణం పూర్తయ్యాక ఇక్కడ టోల్‌గేటును తొలగిస్తామని చెప్పారని, అయినా ఇంకా వసూళ్లు కొనసాగించడ మేమిటని ప్రశ్నించారు. టోల్‌గేటు వద్ద వసూళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమన్నారు. ఈ విషయంలో శాంతిభద్రతల సమస్య తలెత్తితే అందుకు హైవే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో మంగళవారం రాత్రి నుంచి టోల్‌ఫీజుల వసూళ్లు నిలిచిపోయాయి. బుధవారం సిబ్బంది కూడా రాకపోవడంతో టోల్‌బూత్‌లు ఖాళీగా దర్శనమిచ్చాయి. టోల్‌ఫీజుల వసూలు నిలిపివేయడంతో వాహన చోదకులు ఆనందం వ్యక్తంచేశారు.

డ్యామేజీని సరిచేస్తున్నాం: ఎన్‌హెచ్ఐ పీడీ

ఈ విషయమై నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ రంజన్‌ను వివరణ కోరగా...అగనంపూడి టోల్ గేట్ కొంత దెబ్బతిందన్నారు. ఆ డ్యామేజీని సరిదిద్దే పనిని చేపట్టినట్టు వెల్లడించారు. టోల్‌గేట్ నిర్వహణపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామని, ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

ఉల్లంఘనులపై విచారణ

... 3వ పేజీ తరువాయి

శాఖ నుంచి అనుమతి తీసుకుని రూ.రెండు కోట్లు రాయిల్టీగా చెల్లించింది. అయితే ప్రభుత్వం మారిన నేపథ్యంలో పలువురు ఆ స్థలంలో క్వారీయింగ్‌పై ఫిర్యాదులు చేయడంతో బుధవారం గనుల శాఖ అధికారులు సర్వే ప్రారంభించారు. తీసుకున్న తాత్కాలిక పర్మిట్లకు లోబడే తవ్వకాలు జరిపారా? లేక అదనంగా తవ్వారా? అనేది తేల్చడానికి సర్వే చేస్తున్నామని, ఇందుకు రెండు రోజులు సమయం పడుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే పెందుర్తి మండలం గుర్రంపాలెం ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో పలువురికి స్థలాలు కేటాయించారు. ప్లాట్ల చదును సమయంలో లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న కొండ, సమీపంలో భూముల నుంచి మట్టిని తరలించారు. కొండ నుంచి మట్టి తరలింపునకు ఎటువంటి పర్మిట్లు తీసుకోలేదు. ఏపీఐఐసీ అధికారులు, సిబ్బంది ప్రోత్సాహంతోనే అక్కడ తవ్వకాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదిలావుండగా పరవాడ మండలంలో రెండుచోట్ల గనుల శాఖ ఇచ్చిన క్వారీల్లో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదుపై విచారణ చేపట్టనున్నారు. మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు తన కుమారుడి పేరిట గ్రావెల్ క్వారీ తీసుకున్నారు. ఇంకా తాడిలో మరో గ్రావెల్ క్వారీ ఉంది. ఈ రెండు క్వారీల్లో జారీచేసిన పర్మిట్లకు మించి తవ్వకాలు చేపట్టారని ఫిర్యాదు అందినందున త్వరలో విచారణ చేస్తామని గనుల శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇంకా ఉమ్మడి జిల్లాలో మరికొన్ని క్వారీలపై కూడా ఫిర్యాదులు అందాయని, అయితే వాటి వివరాలు ప్రభుత్వం నుంచి రావలసి ఉందని చెబుతున్నారు.

రాజీనామాకు ససేమిరా?

... 3వ పేజీ తరువాయి

ఏలవచ్చునని భ్రమించారు. వైసీపీ ఓడిపోయినా కుర్చీ వదలడం లేదు. గవర్నర్ నియామకం ద్వారా తనకు పదవి వచ్చింది కాబట్టి ప్రభుత్వం దానిని రద్దు చేయలేదని ఆయన సన్నిహితుల వద్ద చెబుతున్నారు. ఒకవేళ రాజీనామా చేయాలని ఆర్డర్ ఇస్తే, అది చెల్లదంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని అంటున్నట్టు తెలిసింది. తనను వేధిస్తే ఏ విధంగా ఎదుర్కోవాలో తెలుసునని చెబుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై వాట్సాప్ గ్రూపుల్లో రిటైర్డ్ ఏయూ ఉద్యోగులు చాలా ఘాటుగా స్పందిస్తున్నారు. ప్రసాదరెడ్డి పవర్ మాంగర్ (పదవీ వ్యామోహం కలిగినవాడు) అని ఒకరు విమర్శించారు. ఇంకొకరు ఆయన్ను మామూలుగా పంపకూడదని, బలవం తంగా గెంటాలని సూచించారు. ఒక విద్యా సంస్థకు అధిపతిగా వ్యవహరిస్తున్న ఆయనపై ఉద్యోగులలో ఇంత వ్యతిరేకత ఉందా?...అని అంతా ఆశ్చర్యపోతున్నారు.

కమనీయం అప్పన్న కల్యాణం



కల్యాణం చేస్తున్న అర్చకులు

సింహాచలం, జూన్ 26: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత కల్యాణోత్సవం బుధవారం కమనీయంగా సాగింది. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు.కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, కన్యావరుణలు, మధుపర్కప్రాశనము, పాద ప్రక్షాళనలు చేసి జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణలు కావించారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం



విజయదుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

వెంకోజీపాలెం, జూన్ 26: గ్రేటర్ 15వ వార్డు దుర్గానగర్ విజయదుర్గాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ముగిసింది. నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, సాయంత్రం ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. సింహాచలం, అవతార్, సాయి, బుజ్జి, శంకర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంకోజీపాలెం, జూన్ 26: నిర్వహణ పనుల నేపథ్యంలో గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పాత వెంకోజీపాలెం, కొత్త వెంకోజీపాలెం, ఎంవీవీ అపార్టుమెంట్, జేఆర్‌నగర్, యల్లమాంబ, భూలోకమాత ఆలయం, ఉమానగర్, శెట్టిబలిజ వీధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఆనందపురం, జూన్ 26: మండలంలోని వెల్లంకి పంచాయతీ పరిధి బొడ్డపాలెంనకు చెందిన బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సీఐ తిరుపతిరావు తెలిపారు. బత్తుల దివ్య కుమార్తె నిఖిత (13) వెల్లంకి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. బుధవారం పాఠశాలకు వెళ్లి సాయంత్రం తిరిగి రాలేదు. తల్లి దివ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన ప్రవేశాలు

ఆరిలోవ, జూన్ 26: ఆరిలోవ పరిధిలోని 11 మండల ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 108 మంది విద్యార్థులు ఒకటో తరగతిలో చేరినట్టు అధికారులు తెలిపారు. ఈ పాఠశాలలనుంచి ఐదో తరగతి ఉత్తీర్ణత సాధించిన సుమారు 212 మంది విద్యార్థులు ఆరో తరగతిలో చేరారన్నారు. ఆ స్థాయిలో ఈ ఏడాది విద్యార్థుల ప్రవేశాలు జరగలేదని వివరించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

సింహాచలం, జూన్ 26: మహావిశాఖ 98వ వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్లో గుత్తేదారులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ పీవీ నరసింహం అన్నారు. వార్డులో జీవీఎంసీ సాధారణ నిధులతో గాంధీనగర్, కాపువీధిలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని బుధవారం పరిశీలించారు. పంచదార్ల శ్రీనివాసరావు, లక్ష్మణరావు తదితరులున్నారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఒంఎంజి :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 57, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 30, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 30, క్యారెట్ 38, దొండకాయలు 28, బంగాళదుంపలు 32, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 150, అల్లం 160, బరబాటి 60, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 38, దోసకాయలు 18, వెల్లుల్లి 180, కొబ్బరికాయ 23, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 34, కీరదోస 30, కాప్సికమ్ 74, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 38, కంద 60, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా భీమిలిలో విద్యార్థుల మానవహారం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, ఏసీపీ శ్రీనివాసరావు, డీఈవో చంద్రకళ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కొమ్మాది, జూన్ 26: వందరోజుల్లో గంజాయిని అరి కడతామని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఫకీరప్ప అన్నారు. బుధవారం పి.ఎం.పాలెం వి.కన్వెక్షన్ హాల్‌లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా పలు కళాశాలల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో గంజాయి వాడకం పెరిగిందని, యువత పక్కదారిపడుతోందన్నారు. బీచ్‌రోడ్డులో పెద్దఎత్తున జరుగుతున్న బైక్‌రేస్‌ల్లో గంజాయి సేవిస్తున్నవారి పాత్ర ప్రముఖంగా ఉందన్నారు. బైక్ రేస్‌లను వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో పెడుతున్నారని, ఇలాంటివారిని ప్రోత్సహించకూడదన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నట్టు తెలిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ- 1 లక్ష్మీనారాయణ, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, నార్త్ ఏసీపీ సునీల్, గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: పట్టణంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. భీమిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సౌజన్య, ఎస్ఈబీ ఎస్ఐ జి.చిన్నమనాయుడు, డైట్ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రసాద్, బార్ అసోసియేషన్ కార్యవర్గసభ్యులు, అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్: మాదక ద్రవ్యాలతో మానవాళికి పెనుముప్పు పొంచి ఉందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఎం.సరోజదేవి అన్నారు. రుషికొండ గాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలను వివరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. శ్రీనివాస్‌బోస్, డీన్ స్టూడెంట్ ఎఫైర్స్ మోహిని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అనంతరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పెదవాల్తేరు: ఈస్టు పాయింట్ కాలనీ కేడీపీఎం హైస్కూల్‌లో ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్, హిమ హ్యూమానిటేరియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినం నిర్వహించారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని పోస్టర్ ఆవిష్కరించారు. గంజాయి, మద్యం, ధూమపానం వంటి చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. అనంతరం రిటైర్డ్ జడ్జి పైల సన్నిబాబు, జైల్ సూపరిండెంట్ కిశోర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం చట్టరీత్యా నేరమన్నారు. డీఈవో చంద్రకళ, సీఐ పార్థసారధి, జేకే నాయక్, శరగడం సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: బాల్యంలోనే మాదక ద్రవ్యాలకు అలవాటుపడుతున్న పరిస్థితుల్లో తల్లిదండ్రులు పిల్లలపై మరింత దృష్టి సారించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం పిలుపునిచ్చారు. విశాఖలో డ్రగ్స్ మహమ్మారి విజృంభించిందని, హక్కుల కమిషన్ పోలీసులను, ఎస్.ఇ.బి., ఇతర ప్రభుత్వ శాఖలను అప్రమత్తం చేయడంతో పాటు అవగాహన సదస్సులను ఏర్పాటుచేస్తోందన్నారు. పిల్లల దినచర్యలను నిత్యం గమనిస్తుండడంతో పాటు, వారు చెడు మార్గం వైపు మళ్లేందుకు గల అవకాశాలను నిరోధించాలన్నారు.

మద్దిలపాలెం: యువత మత్తు పదార్థాల జోలికి వెళ్తే జీవితాలు నాశనమవుతాయని ఎక్సైజ్ డీఎస్పీ య.సుబ్బారావు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమరవాణా వ్యతిరేకదినోత్సవం సందర్భంగా డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలకు బానిసైతే బతుకు దుర్భరంగా మారుతుందన్నారు. మత్తుపదార్థాలు వినియోగించిన, రవాణా చేసినా కఠిన శిక్షలుంటాయన్నారు. సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం ప్రమాదకరమన్నారు. విద్యార్థులు వీటికి బానిసలై జీవితాలు పాడుచేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు పోలా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జాయింట్ సీపీ ఫకీరప్ప



స్పెషల్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ సరోజాదేవికి సత్కారం



వీఎస్ కృష్ణా కళాశాలలో పాల్గొన్న అధికారులు

బీజేపీ కార్యాలయంలో చలపతిరావుకు నివాళి



చలపతిరావుకు నివాళి అర్పిస్తున్న బీజేపీ నేతలు

పెదవాల్తేరు, జూన్ 26: బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీ చలపతిరావు జయంతి సందర్భంగా బుధవారం నగర బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడ పాటి రవీంద్ర ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్దా లక్ష్మీనారాయణ పీవీ చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ పీవీ చలపతిరావు బీజేపీ బలోపేతపరచడమే కృషి చేశారన్నారు. అనంతరం బుద్దా మాట్లాడుతూ చలపతిరావు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలని ఆంధ్రప్రదేశ్‌లో ఆధికారాన్ని చేపట్టడమే పీవీ చలపతిరావు నిజమైన నివాళి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయుకులు నడుపూరు సన్యాసి రావు, సీనియర్ నాయుకులు కొల్లి రత్నా కుమారి, బీజేపీ మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు సుజాత, మురళీ మోహన్‌రాజు, అప్పారావు, శ్రీరామ్ పాల్గొన్నారు.

'ఏయూ వీసీ, రిజిస్ట్రార్ రాజీనామా చేయాలి'



నిరసన తెలుపుతున్న పరిరక్షణ సమితి సభ్యులు

వెంకోజీపాలెం, జూన్ 26: ఏయూ వీసీ, రిజిస్ట్రార్‌ను వెంటనే మార్పు చేయాలని ఏయూ పరిరక్షణ సమితి సభ్యులు ప్రొఫెసర్ సూరప్పుడు ప్రభుత్వాన్ని కోరారు. రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన బుధవారం 12వ రోజుకు చేరింది. అడ్డగోలుగా వ్యవహరించిన వీసీ, రిజిస్ట్రార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తొలగించిన అసిస్టెంట్, కాంట్రాక్టు ప్రొఫెసర్‌లను విధుల్లోకి తీసుకోవాలని అసిస్టెంట్ కాంట్రాక్టు అసోసియేషన్ అధ్య క్షుడు డాక్టర్ అర్జున్ పేర్కొన్నారు. గెస్ట్ ఫ్యాకల్టీలను విధుల్లోకి తీసుకుని, కన్‌సాలిడేటెడ్ పే ఇవ్వాలని సురేష్ మీనన్ కోరారు. కృష్ణా యూనివర్సిటీ నుంచి వచ్చిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను వెనక్కి పంపాలని డాక్టర్ పొన్నాడ శ్రీను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భాను, డాక్టర్ కల్యాణి, డాక్టర్ దాస్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న యాగశాల నిర్మాణానికి సహకరిస్తా

» సినీ దర్శకుడు అనిల్ రావిపూడి



యాగశాల నిర్మాణంపై అనిల్ రావిపూడికి వివరిస్తున్న పర్యవేక్షణాధికారి శ్రీనివాస్

సింహాచలం, జూన్ 26: వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో నిత్య, వార, పక్ష, మాస, విశేష ఉత్సవాల వేళ జరిపే హోమాలకు వీలుగా శాశ్వత ప్రాతిపదికన యాగశాల నిర్మాణం కానుంది. దేవస్థానం అధికారుల ప్రతిపాదనకు టాలీవుడ్ దర్శకుడు అనిల్ రావిపూడి సమ్మతించారు. 'సంక్రాంతికి వస్తున్నాం' వర్కింగ్ టైటిల్‌తో వెంకటేష్‌తో తీయనున్న తాజా చిత్రం స్క్రిప్ట్‌నకు పూజలు చేయించేందుకు బుధవారం సింహగిరికి వచ్చిన ఆయనకు పర్యవేక్షణాధికారి పిల్లా శ్రీనివాస్ యాగశాల విశిష్టతను వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన అనిల్ రావిపూడి నిర్మాత దిల్‌రాజ్‌తో కలిసి ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు.

బైక్ చోరీల కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ వెంకట రత్నం

మహరాణిపేట, జూన్ 26: నగరంలో పలు పోలీసు స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు క్రైం డీసీపీ పి. వెంకట రత్నం తెలిపారు. బుధవారం పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల స మావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. నగరంలోని న్యూ పోర్టు, మహరాణిపేట, కంచరపాలెం, ఫోర్త్‌టౌన్, పెదగంట్యాడ పెందుర్తి, మల్కాపురం పోలీసు స్టేషన్‌ల పరిధిలో పలు ప్రాంతాల్లో తాళాలు వేసిఉన్న షాపుల షట్టర్లు తొలగించి బైక్‌లను అపహరించుకుపోయారు. వీటిపై పలువురు ఫిర్యాదులు చేయటంతో కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో స్పెషల్ క్రైమ్ పోలీసు టీం ద్వారా దర్యాప్తు నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం పెదగంట్యాడకు చెందిన చిత్తారపు అభిషేక్ (19), పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన కింగంహరి గణేష్ (18), జువ్వాల అశోక్ (18)లను అదుపులోకి తీసుకొని విచారించారు. వారు నేరం అంగీకరించడంతో 13 కేసులలో మొత్తం రూ. 2,70,800 లక్షల సొత్తు చోరీకాగా, నిందితులనుంచి రూ.2,41,500 లక్షల సొత్తును రికవరీ చేసినట్టు డీసీపీ తెలిపారు. విశాఖకు చెందిన చిత్తారపు అభిషేక్ భీమవరంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లినప్పుడు అక్కడ గ ణేష్, అశోక్ పరిచయం అయ్యారు. మద్యం, గంజాయి, విలాసాలకు అలవాటుపడిన వీరు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు డీసీపీ తెలిపారు. ఈ ముగ్గురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

భారీ వర్షంతో భీమిలి వాసులకు అష్టకష్టాలు

భీమునిపట్నం, జూన్ 26: భీమిలిలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో బీచ్‌డు ఉమర్ అలీషా ఆశ్రమం వద్ద ఎర్రమట్టి గెడ్డలో ఓ వ్యాన్ ఇరుక్కుపోయింది. ప్రయాణికులు దానిని తోసుకుని ఒడ్డుకు తెచ్చారు. గెడ్డల ప్రవాహానికి అడ్డంగా అక్రమ నిర్మాణాలతో నిత్యం వర్షాకాలంలో సమస్య ఎదురవుతోంది. భీమిలిలో చాలా గెడ్డలు ఆక్రమణలను గురై మూసుకుపోయాయి. ఎత్తైన ప్రాంతంలో ఉన్న స్థలాలను చదునుచేసి లే అవుట్‌లుగా మార్చడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బుధవారం ఎర్రమట్టి గెడ్డ ఇసుకలో వాహనాలు నిలిచిపోవడం ప్రయాణికులు, వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. ఇలా మట్టి నిలిచిన ప్రతిసారీ జీవీఎంసీ అధికారులు మట్టిని తొలగిస్తున్నారు. శాశ్వతంగా సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టి సారించాలని అభ్యర్థిస్తున్నారు.



వర్షానికి బురదమయమైన బీచ్ రోడ్డు

చల్లబడిన వాతావరణం

సాగర్‌నగర్: సాగర్‌నగర్, రుషికొండ తదితర తీర ప్రాంతాల్లో బుధవారం వర్షం కురవడంతో జనాలు ఉపశమనం పొందారు. కొద్దిరోజులుగా ఎండ, ఉక్కపోతతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. బుధవారం ఉద యం నుంచి ఆకాశంలో మేఘాలు కమ్ముకుని, గుబురు ఎండతో ఇబ్బందిపడినా సాయంత్రానికి వర్షం పడడంతో ఒక్కసారిగా వాతావరణం మారి చల్లబడింది. ఉక్కపోతనుంచి ఉపశమనం పొందారు. ఈ వర్షం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు చేరడానికి ఇబ్బంది ఎదుర్కొన్నారు.

వరద నీటితో అవస్థలు

ఆరిలోవ: పెదగదిలి జంక్షన్‌లో బుధవారం సాయం త్రం కురిసిన వర్షానికి నీరు చేరి ఆ ప్రాంతమంతా చిన్నపాటి చెరువును తలపిస్తోంది. సుమారు రెండు అడుగుల మేర వరద నీరు చేరడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొండవాలు నుంచి నీరు ఇక్కడ చేరుతోంది. చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు విమర్శిస్తున్నారు.





ఎర్ర మట్టిలో ఇరుక్కుపోయిన వాహనాలను తీస్తున్న దృశ్యం



పెదగదిలి కూడలిలో చేరిన వర్షం నీరు

ఎమ్మెల్యే గంటా దృష్టికి బీఆర్‌టీఎస్ సమస్య



గంటాకు సమస్య వివరిస్తున్న కార్పొరేటర్ పీవీ

సింహాచలం, జూన్ 26: పాతగోశాల కూడలి నుంచి పాతఅడివివరం కూడలి వరకు గల బీఆర్‌టీఎస్ సింహాచల కారిడార్ నిర్మాణంలో స్థానికులు ఎదుర్కొంటున్న పలు స మ స్యలను కార్పొరేటర్ పీవీ నరసింహం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలోనే జీవీఎంసీ అధికారుల సమక్షంలో విస్తృత సమావేశం ఏర్పాటు చేస్తానని గంటా హామీ ఇచ్చారన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

సింహాచలం: జీవీఎంసీ అధికారుల నిర్ణయాలతో ఇబ్బందులు పడుతున్న బీఆర్‌టీఎస్ సింహాచల కారిడార్ బాధితులకు సత్వర న్యాయం చేయాలని అడివివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. బాధితులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్లాన్‌కు విరుద్ధంగా మెయిన్‌రోడ్డులోని దాసరి సన్యాసయ్యశెట్టి ఇంటి నుంచి కల్యాణమండపం వరకు అధికారులు రోడ్డు వెడల్పు చేశారని ఆరోపించారు. దీంతో నివాసితులు పది అడుగుల మేర స్థలాన్ని కొల్పోయారన్నారు. నష్ట పరిహారం కానీ, టీడీఆర్‌లు కానీ ఇవ్వలేదన్నారు. అనుసంధాన రోడ్లు నిర్మాణం చేపట్టాలని గ్రామసభ తీర్మానించింది. సభలో దాసరి సన్యాసయ్య శెట్టి, ఇజ్జిరోతు వరలక్ష్మి, ఎన్ని భాస్కరరావు, సిరిపురపు మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లీలామాధవరావు

సింహాచలం, జూన్ 26: ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలు అమలుచేయాలని రేషన్ డీలర్ల రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు డి.లీలా మాధవరావు కోరారు. సింహాచలంలోని ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన డీలర్ల విస్తృతస్థాయి సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న అనంతరం మాట్లాడారు. ఆహార భద్రత చట్టం ప్రకారం సరకులను డీలర్ల ద్వారా మాత్రమే పంపిణీకి చర్యలు చేపట్టాలని, రూ.1500లు గౌరవ వేతనంతోపాటు కమీషన్‌ను పెంచాలని, జీఓ నం.5ను తక్షణం అమలుచేయాలని, రేషన్ షాపులను విలేజ్‌మాల్స్‌గా మార్చాలని, సామాజిక పంపిణీ బాధ్యతలను డీలర్లకు అప్పగించాలని సమావేశం తీర్మానించింది. కాగా విశాఖ జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడిగా గంట్యాడ అప్పలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జీవన్‌కుమార్‌ను, ప్రధానకార్యదర్శిగా నాగేశ్వరరావు, కోశాధికారిగా కె.శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు లీలామాధవరావు ప్రకటించారు.

దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు

మండల సమావేశంలో ఎంపీపీ డీవీఎస్ఎస్ఎన్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు

భీమునిపట్నం, జూన్ 26: గ్రామాల్లో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎంపీపీ డీవీఎస్ఎస్ఎన్ రాజు (వాసురాజు) అన్నారు. బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. త్వరలోనే ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు మాత్రమే హాజరుకావాలని, వారి తరఫున ఎవరూ పాల్గొనకూడదని కోరారు. తాళ్లవలస ఎంపీటీసీ సభ్యుడు కోరాడ రమణ మాట్లాడుతూ, గ్రామంలోని ఉన్నత పాఠశాల పక్కన నిర్మించిన రహదారి ఎత్తుగా ఉండడంతో పాఠశాలలో వర్షం నీరు నిలిచి విద్యార్థులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. వివిధ శాఖాధికారులు శాఖలవారీగా నివేదికలు వినిపించారు. అతిసార ప్రబలకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీలు బోని బంగారునాయుడు, సురపతి దుర్గాలమ్మ, ఎంపీడీవో వి.జానకి, తహసీల్దారు టి.గోవింద, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు కోరాడ పరామర్శ

భీమునిపట్నం, జూన్ 26: గ్రేటర్ 4వ వార్డు పరిధి కె.నగరపాలెంలో తెలుగుదేశం కార్యకర్త తొత్తడి కృష్ణ అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో బుధవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు కృష్ణను పరామర్శించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి ఈ విషయం తీసువెళ్తానన్నారు. నియోజవర్గ ఐటీడీపీ అధ్యక్షులు మరుపిళ్ల రాజేంద్రప్రసాద్, నాయకులు పోతిన అప్పలరాజు, సుభాష్ తదితరులు ఉన్నారు.

బాలికలను చదివించే బాధ్యత తల్లిదండ్రులదే

ఆరిలోవ, జూన్ 26: బడి ఈడు బాలికలను వెంటనే పాఠశాలలో చేర్పించి, చదివించే బాధ్యత తల్లిదండ్రులదేనని సీడీపీవో రమణ కుమారి అన్నారు. గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బేటీ బచావో... బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. సూపర్‌వైజర్ వినీషా సుందరి, వైద్యురాలు కిరణ్ లలితాదేవి, శ్యామలాదేవి, జయ, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

పెదవాల్తేరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు బుధవారం కేడీపీఎం స్కూల్‌లో 6నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, డీఈవో ఎల్.చంద్రకళ బుధవారం స్టూడెంట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాసరావు, కేడీపీఎం ప్రధానోపాధ్యాయురాలు ఎస్.సుమతీబాయి, ఇన్‌చార్జి వి. మధుస్మిత, ఉపాధ్యాయులు జి.సురేష్, ప్రసాద్, శ్రీనివాసరావు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను బడిలో చేర్చాలి

కొమ్మాది: వివిధ పనుల్లోని వెళ్తున్న పిల్లలను గుర్తించి వారు పాఠశాలల్లో చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర బీసీ సెల్ ప్రధానకార్యదర్శి మొల్లిలక్ష్మణరావు కోరారు. బుధవారం 5వ వార్డు పరిధి బొట్టవానిపాలెం, శివశక్తినగర్, బోరవానిపాలెం తదితర ప్రాంతాల్లో నేను బడికి పోతా కార్యక్రమాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాండ్రాసి అప్పలరాజు, బోయి వెంకటరమణ, బోయి రమాదేవి, ఈగల రవి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణానికి అడ్డుకట్ట



అక్రమంగా నిర్మిస్తున్న ఇంటిని తొలగిస్తున్న సిబ్బంది

భీమునిపట్నం, జూన్ 26: మండలంలోని కాపులుప్పాడ రెవెన్యూ మంగమారిపేట కొండ ఏటవాలు ప్రదేశంలో అనుమతులు లేకుండా నిర్మిస్తోన్న ఇంటి నిర్మాణాన్ని బుధవారం రెవెన్యూ అధికారులు కూలగొట్టారు. సర్వే నంబరు 314లో స్థానికులు కొంతమంది ఐదు ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. వీరిలో ఓ వ్యక్తి ముందుగా నిర్మాణం ప్రారంభించగా, మిగిలిన వారు ప్రభుత్వ స్థలాన్ని చదును చేసుకుంటున్నారు. అయితే, తహసీల్దారుకు అందిన సమాచారంతో ఆయన ఆదేశాలతో వీఆర్వో జి.అప్పారావు, సిబ్బంది అక్కడికి చేరి ఈ ఇంటి నిర్మాణానికి కూలగొట్టారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దారు టి.గోవింద ఈ సందర్భంగా హెచ్చరించారు.